Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 20.03.2015, శుక్రవారం

సంపుటి : 34 సంచిక : 42

పేజీలు : 12, వెల : ₹ 5



Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008
CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
మన్మథనామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు. సం/-





## ఔను... వాళ్లిద్దరికీ చెడ్డపేరొచ్చింది

10లో

- జిల్లా వ్యాప్తంగా అసంతృప్తి
- మాటలు తప్ప చేతలు లేవు

## నీతికి సమాధి

- కర్ణాటక ఐఏఎస్ అధికారి డి.కె.రవి అనుమానాస్పద మృతి
- సర్వత్రా ఆందోళనలు
- సిబిఐ దర్యాప్తుకు కేంద్ర హోంమంత్రి సంకేతం



10లో



## చంద్రులకు ఝలక్



- సోమిరెడ్డికి ముందే చెప్పారు
- రవిచంద్రకు ఆఖరి నిముషంలో హ్యాండిచ్చారు

**ఎమ్మెల్సీ ఎంపిక విషయంలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఇచ్చిన షాక్‌కు జిల్లాలో ఇద్దరు చంద్రులకు తలలు తిరిగి మైండ్ బ్లాక్ అయ్యాయి. చంద్రబాబు రాజకీయం ఎంత ఘోరంగా ఉంటుందనే విషయం వారికి ఇప్పుడు తెలిసొచ్చింది. ఎమ్మెల్సీ విషయంలో నెల్లూరుజిల్లా నాయకులకు చంద్రబాబు మొండి చేయి చూపించారు.**

జిల్లా నుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్రల పేర్లు ఎమ్మెల్సీ పదవులకు బలంగా వినిపిస్తూ వచ్చాయి. ప్రస్తుతం ఎమ్మెల్యేల కోటాలో ఐదు ఎమ్మెల్సీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడగా, తెలుగుదేశంకు మూడు, వైకాపాకు రెండు దక్కాయి. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక ముందు చంద్రబాబు రెండు ప్రధాన నిబంధనలు పెట్టాడు. 2014సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు ఇప్పుడు ఎమ్మెల్సీ ఇచ్చేది లేదన్నాడు. దాంతో కొద్దిరోజుల క్రితమే సోమిరెడ్డి ఆశలు వదులుకున్నాడు. ఇక గత ఎన్నికలప్పుడు కాంగ్రెస్ నుండి తెలుగు దేశంలో

(మిగతా 10వ పేజీలో)



Congratulations
and Best Wishes
on entering
Silver Jubilee Year
of Practice



Receiving State Best student award for academic excellence from the Golden hands of Bhagawan Sri Satya Sai Baba

CA T. SRINIVASULU GARU
B.Com., FCA., AICWA., ACS., BL., MBA., DISA(ICAI)., IRPM
Chartered Accountant
Mobile : 9848170568



Congratulations and Best wishes to Sri TALLURI SRINIVASULU garu, a renowned Chartered Accountant,studied in Prestigious colleges like APRJC Nagarjuna Sagar and Silver Jubliee Government Degree College Kurnool, State Ranker in Intermediate, University Ranker in Graduation, Gold Medalist, Recipient of Andhra Pradesh State Best student award for academic excellence from the Golden hands of Bhagawan Sri Satya Sai Baba and one among very few highest qualified Chartered Accountants in India with five commendable Professional qualifications CA, ICWA, CS, BL, MBA to his credit, On entering in to 25th year i.e. Silver Jubilee Year of practice as a Chartered Accountant after completion of 24 years of glorious practice in Nellore.

Clients, Staff, Family Members
Friends, Relatives and Well Wishers

# స్వచ్ఛభారత్ ర్యాలీ



నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం పల్లెపాడు గ్రామంలోని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛభారత్ ర్యాలీ కార్యక్రమం జరిగింది. ఈ ర్యాలీని తెలుగు భాషోద్యమ వ్యవస్థాపకులు ఆచార్య ఆదిత్య ప్రారంభించి మాట్లాడుతూ మన దేశంలో ప్రతియేటా దాదాపు ఆరులక్షల మంది ఐదేళ్ల లోపు చిన్నారులు పారిశుధ్య లోపంతో చనిపోతున్నారని, దీని నివారణకు ప్రధాని సూచించిన స్వచ్ఛభారత్‌కు విద్యార్థులే కంకణం కట్టాలన్నారు. ఆశ్రమ ప్రచార కమిటి సభ్యురాలు గూడూరు లక్ష్మి మాట్లాడుతూ మహాత్మాగాంధీ 150వ జయంతికి మనం ఘన నివాళి ఇవ్వాలంటూ గ్రామప్రజలు, విద్యార్థినీవిద్యార్థులను కోరుతూ నెలలో రెండురోజులైనా ప్రతిఒక్కరూ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తే పూర్తిస్థాయి పరిశుభ్రత సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ పీస్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు యం.మాలకొండయ్య, పినాకిని దేహ సమర్పకుల సంస్థ వ్యవస్థాపకులు టి.సుకుమార్‌రెడ్డి, ఆశ్రమ నిర్వాహకులు సుబ్బారెడ్డి, మేనేజర్ మూర్తి దంపతులు, గ్రామసర్పంచ్ గూడూరు జయరామయ్య, ఉపసర్పంచ్ శివకుమార్ పాల్గొని గాంధీ ఆశ్రమం నుండి వీవర్స్ కాలనీ మీదుగా శివాలయం వరకు ర్యాలీలో పాల్గొన్నారు.

# ఎర్రచందనం లారీ పట్టివేత

నెల్లూరుజిల్లా తడ మండలం చేనిగుంట వద్ద 14వ తేదీ జాతీయ రహదారిపై ఎర్రచందనం తరలిస్తున్న లారీని తడ పోలీసులు పట్టుకున్నారు. లారీలోని 54ఎర్రచందనం దుంగలతో పాటు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ లారీకి పైలట్‌గా వ్యవహరిస్తున్న స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సూళ్లూరుపేట సిఐ విజయకృష్ణ వివరాల మేరకు నెల్లూరు, కడప జిల్లాల సరిహద్దు నుంచి ఎర్రచందనం దుంగలతో లారీ చెన్నై వెళుతోందని సమాచారం రావడంతో, శ్రీహరికోట ఎస్సై అంకమ్మ తడ పోలీసులతో కలిసి లారీని, పైలట్‌గా వ్యవహరిస్తున్న స్కార్పియో వాహనాన్ని, ముగ్గురు నిందితులను, 54ఎర్రచందనం దుంగలను పట్టుకున్నట్లు తెలిపారు. దుంగలు దాదాపు రెండు టన్నుల బరువు వుంటుందని విలువ సుమారు కోటి రూపాయలు వరకు ఉంటుందని అంచనా వేశారు.

# ఉపాధ్యాయురాలి జీతం.. ప్రధానోపాధ్యాయురాలు భోజ్యం!

- **సహ చట్టంతో రూ. 3లక్షల అవినీతి భాగోతం వెలుగులోకి**

***విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన ఓ ప్రధానోపాధ్యాయురాలే మార్గం తప్పారు. డబ్బుపై వ్యామోహం, ఉన్నతాధికారులు తనకు అండగా ఉన్నారన్న అనైతిక ధైర్యంతో అదే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయురాలి జీతం కాజేశారు. ఇంకేముంది.. ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా రూ. 3 లక్షల వరకు ఉపాధ్యాయిని జీతంతోపాటు ప్రభుత్వ సొమ్మును పక్కదోవ పట్టించి తన ఖాతాలోకి మార్చుకున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా బాధిత ఉపాధ్యాయిని వివరాలు సేకరించడంతో అవినీతి భాగోతం బయటపడింది.***

ఆత్మకూరులోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 2011 జూన్ నుంచి జి.మెర్సీ మాలిని ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. ఈమె 2013 జనవరిలో ప్రసూతి సెలవు పెట్టారు. ఆరునెలల సెలవు రోజుల్లో ప్రతినెలా ఆమెకు రావాల్సిన జీతం అందలేదు. తిరిగి ఆమె జులైలో విధుల్లో చేరారు. నవంబరు11 వరకు పని చేశారు. ఈ పనిదినాలకు కూడా ఇంతవరకు జీతం ఊసే లేదు. అప్పటి నుంచి ఆమె మరో నాలుగున్నర నెలలపాటు, అంటే.. 2013 నవంబరు 12వతేదీ నుంచి 2014 మార్చి 28వ తేదీ వరకు లాస్ ఆఫ్ పే విధానంలో సెలవు పెట్టారు. అంటే ఈ సమయంలో ఆమెకు జీతం అందకూడదు. కానీ ఆమె పని చేసినట్టుగానే చూపుతూ నిధులను పక్కదోవ పట్టించి ప్రధానోపాధ్యాయురాలు తన ఖాతాలో జమ చేయించుకున్నారు. మార్చి 29 నుంచి మెర్సీమాలిని విధుల్లో చేరినా ఏప్రిల్ 30వ తేదీ వరకు పని చేసిన జీతం ఇప్పటికీ అందలేదు. ఈ మొత్తం వ్యవహారంపై ఉపాధ్యాయిని మెర్సీమాలిని సమాచార హక్కు చట్టం ద్వారా సంబంధిత ట్రెజరీ నుంచి వివరాలు రాబట్టడంతో మొత్తం అవినీతి భాగోతం బయటపడింది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రసూతి సెలవుల్లో ఆమెకు రావాల్సిన మొత్తం, లాస్ ఆఫ్ పే సమయంలో చెల్లించకూడని జీతాన్ని, పని చేసినట్లు చూపించి, నిధులను పక్కదోవ పట్టించిన మొత్తం వెరసి రూ. 3లక్షల మేర అక్రమం జరిగినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఉపాధ్యాయిని ఈ అక్రమాలను ఆధారాలతో సహా, గత నెలలో జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారుల ముందుంచారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ట్రెజరీ అధికారుల ప్రమేయం లేకుండా ఇంత పెద్ద మొత్తం వేరొకరి ఖాతాలో జమ అయ్యే అవకాశం లేదు. అయితే ప్రసూతి సెలవులకు సంబంధించిన జీతం నవంబరులో ఆలస్యంగా జమ చేసినట్లు హెచ్ఎం చెబుతున్నా.. మిగిలిన వ్యవహారం రాష్ట్ర విభజన హడావిడిలో ఇలా చేయాల్సి వచ్చిందని ఇటు హెచ్ఎం, అటు ఎస్‌టిఒలు సమర్థించుకోవడం కొసమెరుపు.

# చెంగాళమ్మ ఆలయంలో ఉగాది ఉత్సవం

సూళ్లూరుపేటలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరిదేవి ఆలయంలో ఈ నెల 21న ఉగాది ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆ రోజున ఉదయం 8 గంటలకు కలశ ప్రతిష్ఠ చేసి, అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజలు చేస్తామని వారు వివరించారు. స్వర్ణకిరీట ధారణ, చందనాలంకార శోభితమైన అలంకారాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఆరోజ సాయంత్రం 5 గంటలకు నరసరావుపేటకు చెందిన ప్రముఖ పండితులు శ్రీ మూర్తి రాంబాబు పంచాంగశ్రవణం వినిపిస్తారని పేర్కొన్నారు. లక్ష కుంకుమార్చనలో పాల్గొనదలచిన దంపతులు తమ పేర్లను దేవస్థానంలో నమోదు చేసుకోవాలని వారు కోరారు. అమ్మవారికి ఉగాది రోజున ప్రత్యేకంగా ఏర్పాటుచేసే చందనాలంకార సేవకు ప్రముఖులు మాగుంట పార్వతమ్మ సుబ్బరామిరెడ్డి, మాగుంట సుధాకరరెడ్డి-స్నేహలత, మాగుంట శ్రీనివాసులురెడ్డి-గీతాలత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తారని వారు పేర్కొన్నారు. అమ్మవారి పుష్పాలంకరణకు నెల్లూరుకు చెందిన ఆర్-9000 టెక్స్‌టైల్స్-గార్మెంట్స్‌వారు ఉభయకర్తలుగా వుంటారని, అదేవిధంగా అదేరోజున జరిగే అన్నదానానికి పల్లంపర్తి రామచంద్రారెడ్డి-విజయమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరిస్తారని వారు వెల్లడించారు.

# ఎంబిబిఎస్ సీట్ల పేరుతో టోకరా!

ఎంబిబిఎస్ సీట్ల పేరుతో టోకరా వేసిన మహిళను ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... కర్ణాటకలో వైద్య విద్య కోర్సులకు సంబంధించి మేనేజ్‌మెంట్ సీట్ల పేరుతో దాదాపు రూ.2కోట్లు వరకు వసూలు చేసిన నెల్లూరు ఉస్మాన్‌సాహెబ్‌పేటకు చెందిన లక్ష్మీ పార్వతిని నెల్లూరు రెండవ నగర పోలీసులు 14వతేదీ అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు కర్ణాటకలోని ఓ వైద్య కళాశాలలో మేనేజ్‌మెంటు కోటా కింద ఎంబిబిఎస్ సీట్లు ఇప్పిస్తానని లక్ష్మిపార్వతి ఎస్ఎంఎస్‌ల ద్వారా పలువురికి మెసేజ్‌లు పంపించింది. ఎంసెట్ రాయాల్సిన పని లేదని ర్యాంకు అంతకంటే అవసరం లేదని కోరుకున్నంత ఇస్తే మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు ఇప్పిస్తానని నమ్మ బలికింది. దీంతో గుంటూరు, నరసారావుపేటలతో పాటు నెల్లూరుజిల్లాలోని కావలి తదితర ప్రాంతాలకు చెందిన కొందరు తల్లిదండ్రులు ఆమె మాయలో పడ్డారు. తమ పిల్లల్ని డాక్టర్లు చేయాలన్న ఆశతో ఆమెకు లక్షల రూపాయల్లో అడ్వాన్సులు ఇచ్చారు. అయితే రోజులు గడుస్తున్నా అడ్మిషన్లకు సంబంధించి ఎలాంటి సమాచారం రాకపోవడంతో కొందరు కర్ణాటకలోని ఆ కళాశాలకు వెళ్ళి విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. తమ పిల్లల విద్యా సంవత్సరం వృధా అయిందని బాధపడుతూ చేసేది లేక తీసుకున్న డబ్బులైనా తిరిగి ఇవ్వమని ఆమెను కోరారు. ఫలితం లేకపోవడంతో ఇంటికెళ్ళి నిలదీశారు. ఏం చేసుకుంటారో చేసుకోండని ఆమె సమాధానం ఇవ్వడంతో చేసేదిలేక బాధితులు గత ఏడాది పోలీసు గ్రీవెన్స్‌లో జిల్లా ఎస్పీ ఎస్.సెంథిల్‌కుమార్‌కు తమ బాధను వివరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు రెండవ నగర పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బెంగళూరు, ముంబాయి తదితర ప్రాంతాల్లో ఉన్న ఆమె ఆస్తుల వద్ద దాచిన రూ.52.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.



# గీతాంజలిలో రక్తదాన శిబిరం

గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 14వతేదీ కళాశాల జాతీయ సేవా శిబిరం విభాగం, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్తనిధి కన్వీనర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఇన్‌ఛార్జి, జిల్లా వైద్యశాఖాధికారి డా॥ సి.రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు 110యూనిట్ల రక్తాన్ని స్వచ్ఛందంగా దానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి.సుబ్బారావు, చీఫ్‌మెడికల్ ఆఫీసర్ డా॥ పెంచలయ్య, మెడికల్ ఆఫీసర్ డా॥ వెంకయ్య, రక్తనిధి మోటివేటర్ బి.భాస్కరరావు, కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ యన్.సుధాకర్‌రెడ్డి తదితర అధ్యాపక, అధ్యాపకేతరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పశువుల అభివృద్ధికి 'కామధేనువు' పథకం

- పశు సంవర్థకశాఖ జె.డి శ్రీధర్‌కుమార్

కామధేనువు పథకం ద్వారా సంకర జాతి పశువుల అభివృద్ధికి కృషిచేయనున్నట్లు పశు సంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌కుమార్ పేర్కొన్నారు. కొండాపురం మండలంలోని చింతలదేవి పశుక్షేత్రాన్ని జిల్లాకు చెందిన పలువురు అధికారులు సోమవారం సందర్శించారు. ఈ పశుక్షేత్రంలో కామధేనువు పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జె.డి శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ కామధేనువు పథకం ద్వారా ఇక్కడ పశువులను ఉత్పత్తి చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అందుకోసం 35 రకాల ఆవులను, మరో 13 రకాల గేదెలను ఇక్కడ వుంచి, వాటి ద్వారా బ్రీడింగ్ చేయించి పశువులను ఉత్పత్తి చేస్తారన్నారు. వీటిని ఈ ప్రాంత రైతాంగానికి ఇవ్వడంతో పాటు, ఏ ప్రాంతానికైనా ఎగుమతి చేసేందుకు అవకాశం వుందన్నారు. ఇందుకు వెయ్యి ఆవులను, గేదెలను ఇక్కడకు త్వరలో తెస్తామన్నారు. దీనికోసం ప్రభుత్వం రూ. 250 కోట్లను మంజూరు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసిందని, తొలివిడతగా రూ.25 కోట్లను మంజూరు చేసిందని ఆయన తెలిపారు. ఈ పశువుల మేత కోసం సుమారు 500ఎకరాలు కావాల్సి వుందన్నారు.

ఈ కార్యక్రమంలో కొండాపురం జడ్పీటిసి సభ్యుడు దామా మహేష్, టిడిపి మండల కన్వీనర్ చెరుకూరి వెంకటాద్రి, ఎన్‌డిసిసి డైరెక్టర్ యారవ కృష్ణయ్య, డి.డి ఖలీల్‌బాషా, ఎ.డి ఆర్.శోభన్‌బాబు, తహశీల్దార్ ప్రమీల, ఎంపిడిఓ పద్మ, వ్యవసాయాధికారి నాగరాజు, ఎంపిటిసి సభ్యుడు రసూల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


# కారులో రూ.5.20లక్షలు చోరీ

కారులో ఉంచిన రూ.5.20లక్షల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన సంఘటన 14వ తేదీ నెల్లూరు ముత్తుకూరురోడ్డు ఆకుతోట హరిజనవాడ సమీపంలో జరిగింది. ముత్తుకూరు మండలం నేలటూరుకు చెందిన జొన్నలగడ్డ సుబ్బారావు చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. 14వ తేదీ ముత్తుకూరులోని బ్యాంకులో రూ.7.50లక్షల నగదును డ్రా చేశాడు. అనంతరం నెల్లూరుకు తన కారులో వచ్చి సామాన్లు కొనుగోలు చేసి రూ.5.20లక్షల నగదును బ్యాగులో వుంచి తనే డ్రైవింగ్ చేసుకుంటూ నగదు బ్యాగును ఎడమవైపు సీట్లో ఉంచాడు. ముత్తుకూరురోడ్డులో వస్తుండగా కారుపైన ఉన్న సరుకుల బాక్సు కిందపడడంతో, బాక్సును తీసుకుని కారులో పెట్టే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మోటారుబైక్‌పై వచ్చి కారు ముందు సీట్లో ఉంచిన నగదు బ్యాగును ఎత్తుకెళ్లారు. ఈమేరకు కేసు నమోదు చేసి నెల్లూరు రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నేటి యువకులే... రేపటి వృద్ధులు

**• మనసులో మాట**

*నవ మాసాలూ నిన్ను తన గర్భంలో మోసిన తల్లి, తన రక్తాన్ని ధారపోసి.. నీకు జన్మనిచ్చింది. నీకంటూ ఒక ఆకృతినిచ్చింది. ప్రస్తుతం నువ్వు బతుకుతున్న ఈ శరీరం ఆ తల్లి వరప్రసాదమే. కాన్పు గదిలో ఆమె ప్రవేశించినప్పుడు, ప్రాణాంతకమైన ప్రసవ వేదననంతా భరించి, ఇదిగో... ఎంతో ఆప్యాయతతో, ప్రేమతో నిన్ను ఈ జగత్తులోకి తీసుకువచ్చింది. జన్మనిచ్చిన తల్లి.. సాక్షాత్తూ ఆ దైవంతో సమానం. అందుకే, మాతృదేవో భవ!.. అన్నారు మన పెద్దలు.*



మనం ఆ భగవంతుడిని కళ్ళారా చూడలేకపోవచ్చు. అయితే, ఆ దైవం కనిపించడం లేదే..అన్న లోటును భర్తీ చేసేది ఒక్క తల్లి మాత్రమే. కనిపించే దైవమే ఆ తల్లి.. ఆమే ప్రత్యక్ష దైవం.

నిన్ను ప్రతిక్షణం ప్రేమిస్తూ.. నీ అభ్యున్నతిని కాంక్షించే భగవత్స్వరూపం.. తల్లి!.. అందుకే నీ తల్లిని నీవు ఒక దేవతగా నిత్యం పూజించాలి. నీ కోసం ఆ మాతృ మూర్తి చేసిన ప్రతి త్యాగానికీ ప్రతీకగా.. ఆమె నడయాడిన భూమిని మనసారా నువ్వు ముద్దాడాలి.. కృతజ్ఞతతో కళ్ళకద్దుకోవాలి.

అదేవిధంగా, తన కుటుంబం కోసం.. తన బిడ్డల సంరక్షణ కోసం తండ్రి ప్రతిక్షణం ఎంతో తపనపడతాడు.. శ్రమిస్తాడు. ఆయన ప్రతిక్షణం తన కుటుంబం గురించి, తన పిల్లల భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ వుంటాడు. అంతేకాదు, పిల్లల భవిష్యత్తు కోసం.. వారి భావి జీవితం కోసం తానెంతో కష్టపడి సంపాదించి, కొంత వారి కోసం కూడబెడతాడు. అనేక సందర్భాల్లో తమ జీవితయానంలో తండ్రులు అనుభవించే గుండెపోట్ల వంటి ఆటుపోట్లు.. వారి కుటుంబాల అభివృద్ధికి తండ్రులు పడే మానసిక వత్తిడికి సంకేతాలనే చెప్పవచ్చు. తండ్రి.. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి.. నిన్ను ప్రపంచంలో ఒక విజయవంతమైన వ్యక్తిగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషిచేస్తాడు. అందుకే, తండ్రి కూడా భగవత్స్వరూపుడే. అందుకే, మన పెద్దలు తండ్రిని.. దైవంతో సమానంగా పేర్కొంటూ, 'పితృదేవో భవ!'.. అన్నారు.

## మాతృ దేవో భవ!.. పితృ దేవో భవ!

*తొమ్మిది నెలలు మోసి తల్లి మనకు జన్మనిస్తుంది. ఈ దేహం, ఈ ప్రాణం... అన్నీ ఆ తల్లి వరప్రసాదం. జన్మనిచ్చిన తల్లి సాక్షాత్తూ దైవంతో సమానం. అందుకే మాతృదేవోభవ అన్నారు మన పెద్దలు. అదే విధంగా, ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి ఎల్లప్పుడూ మన వెన్నంటి ఉండి నడిపిస్తూ... మన అభ్యున్నతిని కాంక్షించే దైవస్వరూపం... తండ్రి! అందుకే పితృదేవోభవ అన్నారు. మమతానురాగాలను పంచి... మనల్ని పెంచిన తల్లిదండ్రులిద్దరినీ మనం ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదు.*

దేవుడు ఎక్కడ వున్నాడో మనకు తెలియదు కానీ..నీ అభివృద్ధిని కాంక్షిస్తూ...నీ వెన్నంటి వుండి నిన్ను నడిపిస్తూ.. ప్రోత్సహిస్తూ,, నీ జీవిత ప్రయాణంలో నీవు ఒడిదుడుకులకు గురైనప్పుడు నిన్ను రక్షిస్తూ, జీవితంలో నువ్వు కిందపడిన ప్రతిసారీ నిన్ను పైకి లేవదీసే దైవం..ఆ తండ్రే. అందుకే, తండ్రి ఆ భగవంతునితో సమానం.

అయితే, దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, నీకు రెక్కలొచ్చిన తర్వాత, నీకంటూ ఒక జీవితం ఏర్పడిన తర్వాత.. ఏ ఉద్యోగంతోనో.. లేదా వ్యాపారంతోనో జీవితాన్ని నువ్వు ప్రారంభించినప్పుడు.. హాయిగా నువ్వు పెళ్ళి చేసుకున్నప్పుడు.. ఆ తర్వాత స్వేచ్ఛా విహంగంలా నీ జీవితంలోకి నువ్వేమో ఎగిరిపోతావ్.. నిన్ను కన్న తల్లిదండ్రుల బాగోగులను మాత్రం మరచిపోతావ్!..

నీకు జీవితంలో అన్నీ సమకూర్చిన తల్లిదండ్రులను విస్మరించి, వారి పాటికి వారినొదిలేసి.. నువ్వెళ్ళిపోవడం వారికెంత వేదన కలిగిస్తుందో నువ్వు వూహించలేవు. అనుక్షణం నీ అభ్యున్నతికి తపించిన కన్నవారిని అలా నిర్దయగా.. నిర్దాక్షిణ్యంగా వదిలేసి వెళ్ళిపోవడం ఎంతవరకు న్యాయమో ఆలోచించు. ఒకవేళ నువ్వు ఎప్పుడన్నా నీ తల్లిదండ్రుల కోసం ఒక్క త్యాగం చేస్తే..నీ కోసం వారు లక్ష త్యాగాలు చేయడానికి కూడా సిద్ధంగానే వుంటారనే సత్యాన్ని ఎప్పుడూ మరచిపోకు. ఈ విషయం నువ్వు ఎంతగా గుర్తుంచుకుంటే..అంతగా నీ తల్లిదండ్రులను నువ్వు ప్రేమిస్తావు.

నీకంటూ ఒక జన్మనిచ్చిన అనురాగ దేవతలైన ఆ తల్లిదండ్రుల పట్ల..బిడ్డగా నువ్వు ఎప్పుడూ కృతజ్ఞతాభావం కలిగివుండాలి. అప్పుడే నువ్వు మనిషిగా బ్రతికినట్లు..మహనీయమైన మనీషిగా ఎదిగినట్లు. తల్లిదండ్రులు నీ కోసం చేసిన అసాధారణమైన..అసమానమైన త్యాగాలను సదా గుర్తుచేసుకోవడం..వారికి నువ్వు చెల్లించే కృతజ్ఞతల్లో ప్రధానమైన విషయమని గుర్తుంచుకో..నీ మనసులో ఈ మాట నిక్షిప్తం చేసుకో!..తల్లిదండ్రులు నీ పట్ల చూపించిన దయకు, అపరిమితమైన ప్రేమకు, నిన్ను పెంచి పెద్దజేయడంలో వారు చేసిన మహత్తరమైన త్యాగాలకూ..వారికి నీవు జీవితాంతం రుణపడి వుండాలి. నీకు ఇంతటి ఉన్నతమైన జన్మనిచ్చినందుకు..ఆ భగవంతునితో పాటు, తల్లిదండ్రులకు కూడా ఎల్లవేళలా కృతజ్ఞతలు తెలియజేస్తుండాలి.

నీవు..నీ తల్లిదండ్రుల పట్ల చూపించే ప్రేమానురాగాలను నీ పిల్లలు గమనిస్తూ వుంటారు. నీ తల్లిదండ్రులను నీవు ప్రేమతో బాగా చూసుకుంటే, నీ పిల్లలు కూడా తల్లిదండ్రులైన మిమ్మల్ని ఆప్యాయతతో చూసుకుంటారు. నీవు నీ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే.. నీ పిల్లలు కూడా మీ పట్ల అదే విధంగా వ్యవహరిస్తారు. నీ తల్లిదండ్రులను ఇప్పుడు నువ్వు ఏ విధంగా చూసుకుంటావో.. నీ వృద్ధాప్యంలోనూ నీ పిల్లలు అదేవిధంగా నిన్ను చూసుకుంటారు. కనుక, వృద్ధాప్యం వచ్చినప్పుడు నీ పిల్లలు నిన్ను ప్రేమగా చూసుకోవాలంటే..ఇప్పుడు నువ్వు నీ తల్లిదండ్రులను ఆప్యాయంగా, ప్రేమగా చూసుకోవాలన్న పరమసత్యాన్ని గ్రహించు. కొన్ని సందర్భాల్లో కుమారుడు, లేదా కుమార్తెకు పెళ్ళయినప్పుడు, వారి అత్తగారు వారిని, వారి వారి తల్లిదండ్రులను పట్టించుకోకుండా వుండేవిధంగా ప్రోత్సహించడం కూడా జరుగుతూ వుంటుంది. అయితే, నేటి అత్తగారు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఆ చర్యలన్నీ పాపకర్మలుగా మారి.. ఆమెకూ ఆ తర్వాత అదేవిధమైన పరిస్థితి ఎదురవుతుంది.

ఇంకొన్ని సందర్భాల్లో భర్త, తన భార్య తల్లిదండ్రులను పట్టించుకోవద్దని ఆమెపై ఒత్తిడి చేస్తుంటాడు. కానీ, ఇప్పుడు యువకుడుగా వున్న ఆ భర్త, రేపటి మామగార్రై భవిష్యత్తులో అదేవిధమైన పరిస్థితిని ఎదుర్కోవాల్సి వుంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. మరికొన్ని సందర్భాల్లో ఇంటికి వచ్చిన కొత్త కోడలు అత్తమామ లను ఇష్టపడకుండా, వారిని విస్మరించేవిధంగా భర్తపై ఒత్తిడి తెస్తుంటుంది. నేటి కోడలైన ఆమె, రేపటికి అత్తగార్రై.. ఇదేవిధమైన దుస్థితిని ఎదుర్కో వాల్సివస్తుందని గుర్తుంచుకోవాలి.

కుటుంబంలో వున్న ప్రతి వ్యక్తి, వారి తల్లిదండ్రులను ప్రేమగా, ఆప్యాయంగా, సక్రమంగా చూసుకోవాలి. వారి యోగక్షేమాల పట్ల శ్రద్ధ చూపుతూ, వారి బాగోగులను పట్టించుకోవాలి. తల్లిదండ్రులు కష్టాల్లో వున్నప్పుడు వెంటనే ఆదుకోవాలి. బాధల్లో వారిని ఓదార్చాలి.. ఆత్మీయంగా వారిని ఆదరించాలి. సుదీర్ఘమైన ఈ జీవితయానంలో.. వారి జీవితాల్లోనూ మనం ఒక కాంతిరేఖగా నిలవాలి.

రోజులో ఒక్కసారైనా, లేదా వీలున్నప్పుడల్లా వృద్ధులైన తల్లిదండ్రుల చెంత కూర్చుని, వారితో మాట్లాడి.. నవ్వించి వారిని ఆప్యాయంగా గుండెలకు హత్తుకుని ప్రేమతో.. చిరునవ్వుతో పలుకరిస్తే చాలు.. అంతే!.. ఈ చిన్న బహుమతి కంటే ఆ తల్లిదండ్రులు పెద్దగా ఆశించేదేమీ వుండదు. ఈ విషయాన్ని బిడ్డలు గుర్తు పెట్టుకుంటే చాలు. ఏ తల్లిదండ్రులైనా బిడ్డల నుంచి కోరుకునేది..వారి ప్రేమ, ఆప్యాయత, అనురాగాలను మాత్రమే!.. బిడ్డల ప్రేమానురాగాలే.. ఆ తల్లిదండ్రులకు ఎనలేని ఆనందాలు. తమ బిడ్డలు సమాజంలో మంచిపేరు తెచ్చుకుని.. గౌరవంగా జీవించడమే వారు ఆ భగవంతుడిని కోరుకునే వరాలు.

ఇంతటి మహనీయమైన.. మానవతామూర్తులైన తల్లిదండ్రులను విస్మరించడం కంటే దారుణం మరొకటి వుండదు. తల్లిదండ్రులను గౌరవించలేని.. ప్రేమించలేని వారిని.. ఆ భగవంతుడు కూడా గౌరవించడు. భగవంతుని నుంచి.. మనం మన జీవితంలో సుఖసంతోషాలను పొందాలని భావిస్తే.. మనం తప్పనిసరిగా తల్లిదండ్రుల మనసులను కష్టపెట్టని విధంగా ప్రవర్తించాలి. కరుణకు ప్రతిరూపాలైన తల్లిదండ్రులపై కాఠిన్యం చూపకుండా ప్రేమతో మెలగాలి. వారు ఎల్లవేళలా సంతోషంగా వుండేలా మనం ప్రవర్తించాలి. వారికోసం మన సమయాన్ని కొంత వెచ్చిస్తూ.. వారి బాగోగులను పట్టించుకుంటూ వుండాలి. మనల్ని కన్నవారిని మనం ఆప్యాయంగా చూసుకోవాలి. అంతే తప్ప, తల్లిదండ్రులను విస్మరించడమో.. వారిని నిర్లక్ష్యం చేయడమో తగదు. అసలు, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే పరిస్థితే ఎవరికీ రాకూడదు.. ఏ తల్లిదండ్రులకూ ఆ దుస్థితే రాకూడదు. చివరిగా నా సందేశం ఒక్కటే!..

***ఈ అనంతమైన సృష్టిలో కోటానుకోట్ల జీవరాశుల్లో..మానవ జన్మ అనేది ఎంతో ఉన్నతమైనది. ఇంతటి ఉన్నతమైన జన్మనిచ్చినందుకు మన తల్లిదండ్రులకు మనం ఏమివ్వగలం?..వారి రుణం ఎలా తీర్చుకోగలం?... ఈ దేహాన్నీ.. ప్రాణాన్నీ.. ఇంతటి జీవితాన్నీ ప్రసాదించిన ఆ ప్రత్యక్ష దైవాలైన తల్లిదండ్రులకు జీవితాంతం కృతజ్ఞతగా వుండడమే మనిషిగా మన ధర్మం.. అదే మన జన్మకు సార్థకత. మన ఆనందమే పరమావధిగా భావించే మమతల మల్లియల్లాంటి మన తల్లిదండ్రుల పట్ల.. మనకున్న ప్రేమానురాగాలు ఏనాడూ తరిగి పోకుండా చూసుకోవడమే మన గురుతరమైన బాధ్యత. ఇది మనందరి కర్తవ్యం కూడా!..***




**మనోజ్ సాయి నంబూరు**
చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్
అలయన్స్ గ్రూప్ (చెన్నై)
'మొగల్స్ ఆఫ్ రియల్ ఎస్టేట్' గ్రంథ రచయిత
ఎకనమిక్ టైమ్స్ ఏస్ టెక్ అవార్డు గ్రహీత

# 'ప్రభా'తం

రాష్ట్రాన్ని విభజించడమే ఆంధ్రప్రదేశ్‌కు శాపం. అంతపనీ జరిగిపోయాక..వచ్చే ఆ కష్టనష్టాలన్నిటినీ అనుభవించాల్సి వుంది కనుక, ఆంధ్రప్రదేశ్‌కు 'ప్రత్యేక హోదా' కల్పిస్తామన్నట్లుగా అప్పట్లో కాంగ్రెస్ ఉత్తుత్తి హామీలిచ్చేసింది. అధికారం వుంది కదా అని అత్యంత దారుణంగా రాష్ట్రాన్ని ముక్కలు చేసేసింది. అయితే, ఆ పాపం ఊరకే పోదన్నట్లుగా, అది తిరిగి కాంగ్రెస్‌కే పెనుశాపమై చుట్టుకుంది. రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలై, దిక్కూ దివాణం లేకుండా పోయింది. ఇప్పుడు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి వచ్చాక, కాంగ్రెస్‌కు ఏమి చేయాలో పాలుపోవడం లేదు. పార్టీని తిరిగి ఏదోవిధంగా బతికించుకోవాలంటే, అప్పట్లో ఇచ్చిన హామీలను అమలు జరిగేట్టు చూడాలని ప్రభుత్వం మీద వత్తిడి తేవడం మినహా మరో దారి కనిపించడం లేదేమో!.. అందుకే, రాష్ట్రంలోనూ నేతలను రంగంలోకి దింపి, దీక్షలకు కూడా సిద్ధమంటోంది కాంగ్రెస్. రాష్ట్రానికి ప్రత్యేకహోదా కల్పించాలని ఆందోళనకు సమాయత్తమవుతోంది. నిజంగా వారికి చేయాలని వుంటే, ఆ హోదా ఏదో అప్పుడే ఇచ్చి వుండేవారే. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి చేయి దాటిపోయింది. ఇదిలావుంటే, తమ పార్టీ అధికారంలోకి వస్తే, ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేకహోదా ఇస్తామని ప్రకటించుకున్న బిజెపి కూడా ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతుండడమే ఆశ్చర్యకరం. అసలు, ప్రత్యేక హోదా హామీ అంశాన్ని అప్పటి యుపిఏ ప్రభుత్వం విభజన చట్టంలో చేర్చనేలేదంటూ బిజెపి లేనిపోని కుంటిసాకులు వెదుకుతుండడమే దుర దృష్టకరం. యుపిఏ ప్రభుత్వం ఆ అంశాన్ని చేర్చకపోతే పోయింది.. రాష్ట్రానికి ఇంత కష్టమూ, నష్టమూ కలిగాక.. కనీసం బిజెపి అయినా ఆంధ్ర ప్రదేశ్ పట్ల సానుకూలంగా స్పందించకపోవడం ఎంతో బాధాకరం. విభజనకు తాము సుముఖమేనని, అయితే విభజన జరిగిన తీరు దారుణమని అంటూ, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తామని అప్పుడు రాజ్యసభలో ప్రకటించిన బిజెపి, తీరా ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఇచ్చిన ఆ హామీని పక్కనబెట్టి, ప్రత్యేకహోదా విషయంలో ఇంకా మీనమేషాలు లెక్కబె డుతుండడం బాధాకరం. అధికారంలో లేనప్పుడు ఒక మాట, వున్నప్పుడు మరోమాట చెప్తుండడం రాజకీయపార్టీలకు అలవాటే అయినప్పటికీ, బిజెపి వంటి జాతీయ పార్టీలకు అది తగదు. రాష్ట్ర విభజన వంటి సున్నితమైన అంశాల్లో బాధిత రాష్ట్రానికి న్యాయం జరిగేలా వ్యవహరించడం ఎంతైనా సముచితం. ఈ విషయంలో కేంద్రం ఇకనైనా పెద్దమనసుతో ఆలోచించాలి. అన్ని పార్టీల నేతలు కూడా రాష్ట్రానికి ప్రయోజనం కలిగించేలా చూడాలి. ఇది అత్యవసరం కూడా. ఇప్పటికే, రాష్ట్రం భారీ లోటు బడ్జెట్‌తో సతమతమవుతూ వుంది. పోలవరం ప్రాజెక్టుకు నిధుల కొరత తీవ్రంగా వుంది. ఆ భారీ నిధులెప్పటికి వస్తాయో తెలియని స్థితి. ప్రతి ప్రాజెక్టుకు నిధుల అవసరం ఎంతైనా వుంది. కానీ, రాష్ట్రానికి ఇప్పుడు అదే కొరత. ఆ కొరతను భర్తీ చేసేందుకు, భారీ సాయం అందించేందుకు కేంద్రం ముందుకు రావడం ఒక్కటే ప్రస్తుతమున్న ఏకైక మార్గం. కేంద్రం అనుకోవాలే గానీ, అదేమీ పెద్ద కష్టం కాదు. ఇదిలావుంటే, తెలుగు రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో రాష్ట్రాలన్నిటి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచిస్తున్న కొందరు నేతల సమగ్ర దృష్టిని కాదనలేం కానీ, విభజనతో అప్పులపాలై, ఆర్థికంగా పూర్తిగా చితికిపోయి, చివరికి రాజధాని కూడా లేక అసహాయ స్థితిలో వున్న ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రాష్ట్రాల మాదిరిగా లెక్కకట్టడం ఏ విధమైన న్యాయమో అలాంటివారంతా మరోసారి ఆలోచించాలి. ఇప్పటికే ఇటీవలి కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర నిరాశను మిగిలించింది. పోలవరంకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం తీవ్ర ఆవేదనను మిగిలించింది. ఇప్పుడు మళ్ళీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో మీనమేషాలు లెక్కించడం అందరికీ వేదన కలిగిస్తోంది.

ఇకనైనా, అలాంటి సన్నాయినొక్కులకు స్వస్తి పలికి, రాష్ట్రాన్ని ఈ గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు నేతలందరూ ఏకత్రాటిపై నిలవాలి. అభివృద్ధిలో తప్పటడుగులు వేస్తున్న రాష్ట్రానికి అందరూ అండగా నిలచి ముందుకు నడిపించాలి. అలా కాకుండా లేనిపోని వ్యాఖ్యలు, అభ్యంతరాలు, విమర్శలు చేయడం వల్ల ఎవరికీ ఒరిగేదేమీ వుండదు. ఇకనైనా అలాంటి తీరు మారాలి.. రాష్ట్రం వెతలను తీర్చాలి. విభజన జరిగినప్పటి సంగతులన్నిటినీ ఇంకా తవ్వుకుంటూ అనవసర కాలయాపన చేస్తుండడం వల్ల ప్రజలకుగానీ, రాష్ట్రానికిగానీ ఒరిగే ప్రత్యేక ప్రయోజనం ఏమీ వుండదు. ఇకపోతే, అసలే రాష్ట్రం నిధుల కొరతతో అస్తుబిస్తుగా వుంటే, రాజధాని నిర్మాణం మరో సమస్యగా మారింది. లక్షల కోట్ల రూపాయల వ్యయంతో, ఆకాశహర్మ్యాలతో, సింగపూర్ తరహాలో రాజధాని నిర్మాణానికి తలపెట్టడం, అందుకు భూముల కోసం రైతులను ఇబ్బందిపెట్టడం ఈ పరిస్థితుల్లో ఇంత అవసరమా?.. మన రాష్ట్రాధినేతలు ఆలోచించాల్సిన విషయమిది. అవసరమైన మేరకు కాకుండా, పటాటోపంగా సింగపూర్ వంటి రాజధానిని నిర్మిస్తామని చెప్తుండడం ప్రజలను మరింత అయోమయానికి గురిచేస్తోంది. నిధులే లేక తంటాలు పడుతుంటే లక్షల కోట్లతో రాజధాని నిర్మాణం సాధ్యమా అన్న మీమాంస అందరిలోనూ వుంది. మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నవ్యాంధ్రకు చేయాల్సింది ఇంకా ఎంతో వుంది.. సాధించాల్సిందీ ఎంతో వుంది. అయితే, ఏ ప్రాజెక్టయినా, ఏ పనైనాసరే నిధులు లేకుండా చేయగలిగిందేమీ వుండదు. మౌలిక వసతులు లేకుండా, ఆర్థిక సంపత్తి లేకుండా ఏమి చేయాలన్నా కష్టమే. అందుకే, ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ, అవసరమైన సాయాన్ని కేంద్రం నుంచి అందుకునేందుకు కృషి చేయడం ఎంతో ముఖ్యం. అందుకు, ఎంతో సంయమనం, ఓర్పు-నేర్పు అవసరం కూడా. ఇలాంటి కష్టాలన్నీ వస్తూ..పోతూనే వుంటాయి. ఆటుపోట్లు ఎవరికైనా సహజం. ఏదేమైనా, అన్ని అవాంతరాలనూ అధిగమించి, ఆర్థిక ఒడిదుడుకులన్నిటినీ దాటుకుని నవ్యాంధ్ర రథాన్ని ప్రగతి దారులపై పరుగులు పెట్టించేందుకు నేతలందరూ నిర్మాణాత్మకంగా కృషి చేయాలి. అప్పుడే, రాష్ట్రానికి అనుకున్న ప్రగతి సాధ్యమవుతుంది. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చినట్లవుతుంది.

## తీరు మారేనా?.. వెతలు తీరేనా?..



ఇప్పటికే ఇటీవలి కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి తీవ్ర నిరాశను మిగిలించింది. పోలవరంకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం తీవ్ర ఆవేదనను మిగిలించింది. ఇప్పుడు మళ్లీ రాష్ట్రానికి ప్రత్యేకహోదా విషయంలో మీనమేషాలు లెక్కించడం అందరికీ వేదన కలిగిస్తోంది. ఇకనైనా, అలాంటి సన్నాయినొక్కులకు స్వస్తి పలికి, రాష్ట్రాన్ని ఈ గడ్డు పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు, ప్రత్యేకహోదా వచ్చేందుకు నేతలందరూ ఏకత్రాటిపై నిలవాలి.

# అన్నదాతను ఆదుకుందాం



సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి

ఈ నెల 15వ తేదీన నెల్లూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జడ్పీహాల్‌లో జరిగింది. ముఖ్యంగా పంటలు, సాగు నీళ్లు, తాగునీళ్లు సమస్యలపై చర్చించారు. నెల్లూరును కరువు జిల్లాల జాబితాలో చేర్చాలని సమావేశంలో తీర్మానించారు. జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా జడ్పీటీసీల సమన్వయంతో నివేదికలు తయారు చేసుకుని పనులు చేపట్టాలని కోరారు. పంటలు ఎండిపోకుండా రైతులు పూర్తిస్థాయిలో పంటలు పండించే విధంగా జిల్లాలో వున్న సాగునీటి కాలువలు, చెరువుల మరమ్మత్తులు చేపట్టాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా కలెక్టర్ యం.జానకి మాట్లాడుతూ జిల్లాలో సాగు నీళ్లు అందక ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరిగిందన్నారు. జిల్లాలో సుమారు 7500ఎకరాల్లో పంటలు ఎండినట్లు లెక్క వచ్చిందన్నారు. త్రాగునీటి, సాగునీటి సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ క్రింద నిర్మిస్తున్న వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయడానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అమలు చేస్తున్నామన్నారు.

సమావేశంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని తాగునీరు, సాగునీరు సమస్యలను ప్రస్తావించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి కనుపూరు కాలువ క్రింద ఎండిపోయిన పంటల గురించి, కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పొదుపు మహిళలు, ఇసుకరీచ్‌ల గురించి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి కాలువ అభివృద్ధి, కావలి ప్రాంతంలో చెరువుల కబ్జాల గురించి మాట్లాడారు. సమావేశంలో పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ పాటించడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.



## బినామీల చేతిలో మైనింగ్ లీజులు

నెల్లూరుజిల్లాలోని పొదలకూరు, రాపూరు, గూడూరు, ఉదయగిరి, వెంకటగిరిలలో ప్రభుత్వ మైనింగ్ లీజులను బినామీల పేర్లతో తెలుగుదేశం నాయకులు తీసుకుంటున్నారు. అసలు ఈ మైనింగ్ భూములు ఎవరి పేరుమీద వున్నాయో తెలియడం లేదు. డాక్యుమెంట్లు, రికార్డులలో పేర్లు మారుస్తున్నారు. ఈ బినామీ లీజులపై కలెక్టర్ జానకి స్పందించాలి. విపక్ష సభ్యులు అసెంబ్లీలో దీనిపై చర్చించాలి.

ఎం.మధుసూదన్, నెల్లూరు.




## ఆక్రమణ తొలగించాలి

విడవలూరు మండల కేంద్రంలోని పీర్లచావిడి కరెంట్ స్థంభం దగ్గర రోడ్డును ఆక్రమించి దుకాణాలు పెట్టారు. బస్సులు, లారీలు, కార్లు వంటి వాహనాలు మలుపు తిరగాలంటే ఇబ్బందికరంగా ఉంది. చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు స్పందించి ఈ ఆక్రమణలు తొలగించాలి.

యం.ప్రసాద్, నెల్లూరు.

## కర్రపెత్తనం వద్దు

ప్రధాని నరేంద్ర మోడీ మీద దేశ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నారు. ప్రజలను మెప్పించే విధంగా ఆయన పాలన ఉండాలే గాని నొప్పించేలా కాదు. పార్లమెంటులో చర్చ లేకుండా భూసేకరణ ఆర్డినెన్స్ తీసుకురావడం సబబు కాదు. దేశంలో పారిశ్రామికాభివృద్ధి జరగాలి. అయితే దాని కోసం రైతుల హక్కులను కాలరాయడం పద్ధతి కాదు. రైతులకు పరిపూర్ణ న్యాయం చేసేలా భూసేకరణ ఉండాలి.

– సి.వీరేష్, తిరుపతి.

## సమయం ముఖ్యం కాదు

అసెంబ్లీ సమావేశాలలో ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ప్రతి విషయంపై తనకి ఇంత సమయం కావాలని కోరడం సబబు కాదు. ఆ విషయంపై సభాపతి కేటాయించిన సమయంలోనే తన వాదనను వినిపించవచ్చు. ప్రతిసారీ ఇలా చేసుకుంటే పోతే... జగన్‌కే నష్టం.

– జె.యస్.కృష్ణ, నెల్లూరు.

# అధ్యక్ష పగ్గాలెవరికి?





*బీద రవిచంద్రకు శాసనమండలి సీటు ఖరారై, చివరి నిమిషంలో మిస్సైంది. అయితే ఎమ్మెల్సీ వచ్చినా రాక పోయినా జిల్లా అధ్యక్ష బాధ్యతల నుంచి ఆయన తప్పు కుంటారనేది ముందునుండీ వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో జిల్లా తెలుగు దేశంపార్టీకి కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీలో పదవులను ఆశించే నాయకులు ఎక్కువగా ఉన్నారు. ఇలా పదవులనాశించేవారిలో ఒకరికి అధ్యక్ష పదవినివ్వడం ద్వారా సంతృప్తి పరిచే అవకాశముంటుంది.*

జిల్లా అధ్యక్ష పదవి నుండి రవిచంద్ర తప్పుకుంటే ఆయన వారసుడిగా ఎవరొస్తారనే మీమాంస మొదలైంది. ఎమ్మెల్సీని ఆశిస్తూ, పోలిట్‌బ్యూరో సభ్యులుగా వున్న సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి మళ్ళీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టే అవకాశాలు లేవు. ఇకపోతే 2014 ఎన్నికల్లో కోవూరు సీటు నాశించి చివరి నిముషంలో మిస్ అయిన పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి పేరు ప్రచారంలో వుంది. గత ఎన్నికలకు ముందు కోవూరు అభ్యర్థిగా బాగా ప్రచారం చేసుకున్నాడు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పార్టీ తరపున ఖర్చు భరించాడు. అసెంబ్లీ అభ్యర్థి కూడా అతనే ననుకున్న తరుణంలో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలుగుదేశంలో చేరడం, టిక్కెట్‌ను ఎగరేసుకుపోవడంతో పెళ్ళకూరుకు మొండి చేయి మిగిలింది. పార్టీ అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని అప్పట్లోనే పెళ్లకూరుకు హామీ ఇచ్చి వున్నారు. పెళ్లకూరు ఎమ్మెల్సీపైనే ఆశలు పెట్టుకుని వున్నాడు. కాని ఆయన రాజకీయగురువు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికే ఎమ్మెల్సీ రాలేదు, ఇక పెళ్లకూరుకు ఎక్కడొస్తుంది. కార్యకర్తలకు అందుబాటులో ఉంటుండటం, అందరితో మంచి సంబంధాలు కలిగివున్న దృష్ట్యా జిల్లా అధ్యక్షపదవికి ఆయన సెట్ అయిపోతాడనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. లేదంటే ఇక సీనియర్ నాయకుడిగా వేనాటి రామచంద్రారెడ్డి పేరు కూడా ప్రచారంలో వుంది. జిల్లా తెలుగుదేశం నాయకులలో వేనాటిని మించిన సీనియర్ లేరు. జిల్లాలో అందరితోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. పార్టీకి చాకిరి చేయడం తప్ప పార్టీ పరంగా ఆయన అనుభవించిందేమీ లేదు. 1983 నుండి కూడా సూళ్లూరుపేట ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గంలో పార్టీని నిలబెట్టుకుంటూ వస్తున్నాడు. పార్టీని అక్కడ పటిష్టంగా నిలిపాడు. సుదీర్ఘకాలం తర్వాత ఆయనకు జడ్పీ ఛైర్మెన్ అయ్యే అవకాశం వచ్చినా, లాటరీ రూపంలో చేజారింది. పార్టీ అధికారంలో వున్న నేపథ్యంలో ఆయన టిటిడి బోర్డు మెంబర్‌గా ఆశిస్తున్నారు. ఆయన విషయంలో చంద్రబాబు కూడా అభ్యంతరం పెట్టే అవకాశాలులేవు. దాంతో పాటూ జిల్లా అధ్యక్షపదవి విషయంలో కూడా ఆయన పేరు పరిశీలనకు వచ్చే అవకాశముంది. జిల్లా అధ్యక్ష పదవిని ఈసారి 'రెడ్డి' సామాజికవర్గానికి అప్పగించే అవకాశాలున్న నేపథ్యంలో ప్రముఖంగా వీరిద్దరి పేర్లే వినిపిస్తుండడం విశేషం.


# కొండంత కలలు... గోరంత నిధులు

*రాష్ట్ర ప్రభుత్వ పనితీరు జంతర్ మంతర్‌గానే వుంది. పథకాలు, నిధులు అన్నీ కూడా పి.సి.సర్కార్ ఇంద్రజాలాన్ని మరిపిస్తున్నాయి. ప్రజల ఆశలేమో కొండలా కనిపిస్తున్నాయి. ప్రభుత్వం రాలుస్తున్న నిధులేమో కంటితుడుపుగా ఉంటున్నాయి.*

నవ్యాంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన మొట్టమొదటి ఆర్థిక బడ్జెట్ జిల్లాకు తీవ్ర నిరాశను మిగిల్చింది. జిల్లాలో ఏ అభివృద్ధి కార్యక్రమానికి కూడా ప్రత్యేక కేటాయింపులు లేవు. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి అయితే అధ్వాన్నం. జిల్లాలో సంగం, నెల్లూరు బ్యారేజీలు అసంపూర్తిగా ఉన్నాయి. తెలుగుగంగ కాలువలు పూర్తి కావాల్సి వుంది. సోమశిల ఉత్తర కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే కావలి కాలువను అభివృద్ధి చేయాలనే డిమాండ్ ఉంది. జిల్లాలో సాగునీటి పనులకు వెయ్యికోట్లకు పైగానే అవసరమని అధికారులు అంచనాలు తయారుచేసి నివేదిక పంపించినా ప్రభుత్వం దానిని లెక్కలోకి కూడా తీసుకోలేదు.

జిల్లాలో కొత్త ప్రాజెక్టులు లేవు. నెల్లూరును స్మార్ట్‌సిటీ చేస్తామన్నారుగాని ఆచరణలో ఆవగింజంత వాస్తవం కనిపించడం లేదు. ఇక మైపాడు, పులికాట్, నేలపట్టు వంటి పర్యాటక కేంద్రాల అభివృద్ధి ప్రస్తావన లేదు. బంగారు, చేనేత ఋణాల మాఫీని ప్రస్తావించలేదు. రాచర్లపాడు వద్ద ఇఫ్కో కిసాన్‌సెజ్ ఖాళీగా వుంది. ఇక్కడ వ్యవసాయానుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చెప్పి వున్నాడు. కాని ఈ బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే రాలేదు. తాగునీటికి, సాగునీటికి కేటాయించిన నిధులు కూడా అంతంత మాత్రం.

అయితే ప్రజలు ఆశించినవేవీ బడ్జెట్‌లో లేకపోగా ఇప్పుడిప్పుడే సాధ్యం కాదనుకుంటున్న దగదర్తి మండలం దామవరం వద్ద విమానాశ్రయం విషయాన్ని మాత్రం ఈ బడ్జెట్‌లో చూపించడం కొసమెరుపు.



# కొండ క్రింద పల్లెల గొంతెండుతోంది!

**ఇంకా మార్చి నెల పోలేదు. ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్నాయి. కొండ క్రింద పల్లె జనాల గుండెల్లో దడ మొదలైంది. ఎందుకంటే సాగునీళ్లు ఎలాగూ వుండవు. తాగునీళ్లకు కూడా కటకటలాడే పరిస్థితి వస్తుంది.**

నెల్లూరుజిల్లాలో కోస్తా, రాయలసీమ వాతావరణం కలగలిసి ఉంటుంది. తూర్పు ప్రాంతాలైన కావలి, అల్లూరు, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు, టిపిగూడూరు, కోవూరు, బుచ్చి వంటి తూర్పు ప్రాంత మండలాలు కొంత వరకు కోస్తా వాతావరణాన్ని కలిగి ఉంటాయి. నేలలు సారవంతంగా ఉండడం, ఎంత కరువు కాలంలో కూడా నీళ్లు దొరికే పరిస్థితి ఉండడంతో ఇక్కడ పంటలకు ఇబ్బంది ఉండదు. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకుని ఉంటారు. సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లు ఏర్పడి తెలుగుగంగ కాలువలు పూర్తయ్యాక జిల్లాలో మధ్యప్రాంతంలో ఉండే మండలాలు బాగుపడ్డాయి. జిల్లాలో అటు కావలి, కలిగిరి, కొండాపురం మండలాలను మొదలుకొని దక్షిణాన వెంకటగిరి, సూళ్లూరుపేట, తడ మండలాల వరకు తెలుగుగంగ నీళ్లు పారుతున్నాయి. ఈ జిల్లాలో తెలుగుగంగ నీటికి నోచుకోని ఏకైక ప్రాంతం ఉదయగిరి. ఈ ప్రాంతంలో ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు, సీతారాంపురం, మర్రిపాడు, వరికుంటపాడు మండలాలకు సోమశిల నీళ్లు తాగే అదృష్టం లేకుండా పోయింది. పెన్న నుండి 200కిలోమీటర్ల దూరంలో వున్న చెన్నైకి తెలుగుగంగ నీళ్లు పోతున్నాయి. పాతిక కిలోమీటర్ల దూరం కూడా లేని ఉదయగిరి ప్రాంతానికి గంగ నీళ్లు లేవు. దీనికి ఆ ప్రాంతం చేసుకున్న దౌర్భాగ్యం జిల్లాలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే ఎత్తులో ఉండడం. దీనివల్ల కాలువల ద్వారా నీటిని పారించే అవకాశం లేదు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా వున్న ఆనం రామనారాయణరెడ్డి ఉదయగిరికి సోమశిల నీళ్లు అందించాలన్న లక్ష్యంతో దాదాపు వెయ్యికోట్ల అంచనాలతో సోమశిల హైలెవల్ కెనాల్‌ను మంజూరు చేయించారు. అయితే అనతికాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పోవడం, తెలుగుదేశం రావడంతో ఆ ప్రాజెక్ట్ మరుగున పడిపోయింది. ఇక ఉదయగిరి ప్రాంతంవాళ్లు సోమశిల హైలెవల్ కెనాల్‌ను మరచిపోవాల్సిందే!

ఈ ప్రాంతంలో నీళ్లకు బావులు, బోర్లు, చెరువులే దిక్కు. గత ఏడాది వర్షపాతం చాలాతక్కువుగా నమోదైంది. ఇప్పటికే చాలావరకు చెరువులు పూర్తిగా ఎండిపోయాయి. బావులు, బోర్లలో నీటి మట్టాలు అడుగంటాయి. ఇక్కడ వరిపైరు తక్కువ. పెద్దగా నీటి వాడకం లేని వాణిజ్య పంటలనే వేస్తుంటారు. వాటికి కూడా అరకొర నీళ్లు పెట్టాలి. ఇప్పుడు ఆ నీళ్లు కూడా లేకుండా పోయాయి. ఇక ఉదయగిరి, సీతారాంపురం, దుత్తలూరు, వింజమూరు మండలాలలో తాగునీటి సమస్య తీవ్రంగా వుంది. తాగునీటి బోర్లు ఎండిపోయాయి. కొత్తగా బోర్లు వేస్తున్నా నీళ్లు పడడం లేదు. రక్షిత మంచినీటి పథకాల ద్వారా ఒకపూట నీళ్లు ఇవ్వడం కూడా కష్టసాధ్యంగా ఉంటుంది. మార్చిలోనే తాగునీళ్లకు ఇన్ని కష్టాలుంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఈ మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# టోల్ పెరికేసారు!




నాలుగులైన్లు, ఆరులైన్ల రహదారులు వేసారని ఆనందపడాలో, వాటిపేరు చెప్పి టోల్‌ఫీజుల క్రింద జేబులు పిండేస్తున్నారని బాధ పడాలో తెలియని పరిస్థితి. ఈమధ్యకాలంలో నాలుగులైన్ల రహదారి మీద పోతున్నామనే ఆనందం కంటే వసూలు చేస్తున్న టోల్‌ఫీజులే బాధ కలిగిస్తున్నాయి. నెల్లూరు నుండి చెన్నైకి పోవాలంటే నాలుగు టోల్‌గేట్లు దాటాలి. ఈ నాలుగు టోల్‌గేట్లకు దాదాపు 300రూపాయలదాకా చెల్లించాలి. రాను పోను 500రూపాయలకు తక్కువ కాదు. ఇది కేవలం కార్లవంటి చిన్న వాహనాలకు చెల్లించే ఫీజు. ఇక ట్యాక్సీలు, బస్సులు, ట్రక్కులు, లారీలకైతే వీపు విమానం మోత మోగుతుంటుంది. నెల్లూరు నుండి గుంటూరు, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినా టోల్‌ఫీజు పేరుతో తోలు పెరికేస్తున్నారు. టోల్ సెంటర్‌కు ఇంకో టోల్ సెంటర్‌కు మధ్య 60కిలోమీటర్ల దూరం ఉండాలి. జిల్లాలో నాలుగు టోల్ కేంద్రాలున్నాయి. కావలి నుండి వెంకటాచలంకు 60కిలోమీటర్ల దూరం వుంది. ఇంతవరకు ఓకే! కాని వెంకటాచలంకు బూదనం టోల్‌ప్లాజాకు మధ్య 30కిలోమీటర్లు కూడా లేదు. బూదనం టోల్‌ప్లాజాకు సూళ్లూరుపేట టోల్‌ప్లాజాకు మధ్య దూరం కూడా 40కిలోమీటర్ల లోపే! జిల్లాలో వున్న నాలుగు టోల్‌కేంద్రాల్లోనే రెండు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. జిల్లాలో జాతీయ రహదారి వుండేది మొత్తం 170 నుండి 180కిలోమీటర్లు. దీనికి ఇప్పటికే నాలుగు టోల్‌ప్లాజాలున్నాయి. ఈ నాలుగు చాలవన్నట్లు నెల్లూరు శివార్లలో కనుపర్తిపాడు వద్ద మరో టోల్‌కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. ఈమేరకు నిర్మాణం కూడా మొదలుపెట్టారు. దీనిపై ప్రజాగ్రహం వెల్లువెత్తింది. దగ్గర ప్రాంతాలకు వెళ్లాలంటే నెల్లూరు నుండి వెళ్లే వాహనదారులు కూడా టోల్‌ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దీనిపై గట్టిగా పోరాడాడు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. అసెంబ్లీలో కూడా ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. టోల్ కేంద్రాన్ని ఆపేస్తామని రవాణాశాఖ మంత్రి సిద్దా రాఘవరావు చేత హామీ ఇప్పించారు. సిపిఎం కార్యకర్తలు, లారీ ఓనర్స్ అసోసియేషన్ వాళ్లు రంగంలోకి దిగి ఇక్కడ టోల్ కేంద్రాన్ని ధ్వంసం చేసారు. చివరకు జిల్లా కలెక్టర్ స్వయంగా ఈ టోల్ కేంద్రం నిర్మాణం పనులను ఆపేయాలని ఆదేశించడంతో ప్రస్తుతానికి టోల్ పనులు ఆగాయి. టోల్ ఫీజులతో వాహనదారుల తోలుపీకాలని వాళ్లు అనుకుంటే, ప్రజలే కాంట్రాక్టర్ల తోలు పెరికేయడం విశేషం.



నెల్లూరు కబుర్లు

# నెల్లూరులో క్లీన్ & గ్రీన్

## రోడ్లపై కనిపిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

కొత్తగా సిమెంట్‌రోడ్లు వేయకపోయినా, డ్రైనేజీ కాలువలు కట్టకపోయినా, పందులు, కుక్కలను పట్టకపోయినా ఒక్క విషయంలో మాత్రం నెల్లూరు నగరపాలక సంస్థ పనిచేస్తున్నట్లుగా కనిపిస్తోంది. అదే రోడ్లు చిమ్మడం. నగరంలో ఈ పనులు జరుగుతున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది చేత బాగానే పనిచేయిస్తున్నారు. రోడ్లను శుభ్రంగా పెడుతున్నారు. నగరపాలక సంస్థలో నిధులు లేవు. ప్రభుత్వం నుండి కూడా నిధులందడం లేదు. ఒక్క అభివృద్ధి పని చేసే పరిస్థితి లేదు. ఉన్న అవకాశమల్లా నగరాన్ని కొంత శుభ్రంగా ఉంచుకుని పనిచేస్తున్నామనిపించుకోవడం. ఎలాగూ నెలొచ్చేసరికి పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలివ్వాలి. కాబట్టి కనీసం వాళ్ల చేతన్నా గట్టిగా పనిచేయిస్తే ఏదో ఒకటి చేస్తున్నట్లుగా ఉంటుందనుకున్నారు. రోడ్లను, వీధులను శుభ్రంగా ఉంచుతున్నారు.

# స్వర్ణభారత్‌లో ఉగాది సంబరాలు

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని స్వర్ణభారత్ ఆవరణంలో ఈ నెల 22వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు ఉగాది సంబరాలను నిర్వహిస్తున్నట్లు స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ ఐ.దీపావెంకట్ తెలిపారు. ఈ ఉత్సవానికి సభాధ్యక్షులుగా కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి యం.వెంకయ్యనాయుడు వ్యవహరిస్తారని తెలిపారు. ఉగాది ప్రాశస్త్య వివరణను వాచస్పతి డా॥ బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఉపన్యసిస్తారు. గౌరవఅతిథిగా నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎం.జానకి పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు సంప్రదాయ వేషధారణ పోటీలు 16సంవత్సరాలలోపు బాలబాలికలకు ఆదివారం ఉదయం 9గంటలకు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో నిర్వహిస్తామని, గెలుపొందిన విజేతలకు అతిథులు బహుమతి ప్రదానం చేస్తారని తెలిపారు.

# లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని కవి సమ్మేళనం

ఉగాది పర్వదినం సందర్భంగా, ఈ నెల 21న నెల్లూరులోని లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. స్థానిక రంగనాయకుల పేటలోని బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు ఈ కవిసమ్మేళనం ప్రారంభమవుతుందని లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని అధ్యక్షులు డి.శరత్‌బాబు తెలిపారు. ప్రముఖ కవి చిన్ని నారాయణరావు సారధ్యంలో ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. మన భాష, సంస్కృతి ప్రతిబింబించేలా, తెలుగుతనం ఉట్టిపడేలా.. మన నెల్లూరు సీమ ప్రాశస్త్యం కన్నులకు కట్టేలా ఈ కవి సమ్మేళనం నిర్వహిస్తామన్నారు.

# మానసిక వికలాంగుల పాఠశాలలో అన్నదానం

నెల్లూరులో వున్న రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోని మాగుంట సుబ్బరామిరెడ్డి మానసిక వికలాంగుల పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అన్నదానం చేశారు. సామాజిక సమరసత వేదిక జిల్లా కార్యదర్శి బూదూరు కేశవరావు, నాగమణిల కుమార్తె విశ్వభారతి జన్మదినం సందర్భంగా ఈ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ వేదిక రాష్ట్ర నాయకులు కోడూరు సత్యనారాయణ, బూదూరు కుటుంబసభ్యులు కాళహస్తి రేవతి, పాఠశాల ప్రిన్సిపాల్ మాధురి, ఫిజియోథెరపిస్ట్ వాసు పాల్గొన్నారు.

# బియ్యపు గింజలతో ప్రపంచ కప్



ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో భారత్ విజేతగా నిలవాలని ఆకాంక్షిస్తూ, నెల్లూరుకు చెందిన సూక్ష్మకళాకారుడు, కవి కాళహస్తి వెంకటశేషగిరిరావు బియ్యపు గింజలతో అత్యద్భుతంగా ప్రపంచ్ కప్ ఆకృతిని రూపొందించారు. 95 బియ్యపు గింజలపై, త్రివర్ణపతాకం, అశోకచక్రాన్ని కూడా అందంగా రూపుదిద్దిన ఈ సూక్ష్మ కళారూపం అందరినీ ఆకట్టుకుంటోంది.





రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా అవార్డుల్లో విజేతగా నిలిచిన అల్లూరు మండలం నార్త్‌మోపూరుకు చెందిన విద్యార్థి పి.మోహన్‌సాయిని ఇటీవల జరిగిన ప్రతిభా అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమంలో అభినందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

# స్వామిదాస్ స్కూలు వార్షికోత్సవ వేడుకలు

నెల్లూరు బాలాజీనగర్‌లోని బి.స్వామిదాస్ స్కూల్ 45వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం స్కూలు ఆవరణలో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ కార్డియాలజిస్ట్ డా॥ శ్రీనివాసరాజు పాల్గొని శ్రీ బి.స్వామిదాస్ స్మారక అవార్డును పూర్వవిద్యార్థి పి.కిషోర్‌కు ప్రదానం చేశారు. ప్రస్తుతం కిషోర్ విశాఖపట్టణంలోని సిఆర్‌పిఎఫ్‌లో డిప్యూటీ కమాన్‌డెంటుగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా డా॥ శ్రీనివాసరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలతో బలవంతంగా చదివించకుండా వారి ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని



ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలలో స్కూల్ అధినేతలు శ్రీమతి లిల్లీ స్వామిదాస్, శ్రీమతి శారద, స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

# పక్క రాష్ట్రాల్లో అమ్ముకోవచ్చు

రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఇతర రాష్ట్రాల్లో అమ్ముకోవచ్చునని జిల్లా కలెక్టర్ ఎం.సుజాత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇక్కడ మద్దతుధర కంటే అక్కడ ఎక్కువ ధర వస్తుంటే మార్కెటింగ్ సెస్‌గాని, ఏపి వ్యాట్‌గాని, సిఎస్‌టి పన్నులు గాని చెల్లించనవసరం లేకుండా ధాన్యాన్ని అమ్ముకోవచ్చున్నారు. ధాన్యం రవాణా సమయంలో మాత్రం పట్టాదారు పాసుపుస్తకం, విఆర్‌ఓ జారీచేసిన ధృవపత్రం తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ ధృవపత్రం జారీచేసిన రోజు నుండి మూడురోజులలోపు మాత్రమే వర్తిస్తుందన్నారు.

# మొక్కలు నాటిన కలెక్టర్

నెల్లూరుజిల్లా పరిషత్ సమావేశానికి ప్రప్రథమంగా హాజరైన జిల్లా కలెక్టర్ యం.జానకి ఆదివారం జడ్పీ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. కలెక్టర్‌కు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, జడ్పీ సిఇఓ జితేంద్ర స్వాగతం పలికారు. జడ్పీ నూతన కార్యాలయంలో పచ్చదనాన్ని చూసిన కలెక్టర్ అప్పుడే ఇన్ని చెట్లు నాటించారే అంటూ ప్రశంసించారు.

# వడ్డీ మాఫీ ఆశలపై నీళ్లు

ప్రతి యేటా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇంటి పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తుంటారు. పాత బకాయిలు వసూలు చేయడం కోసం వడ్డీ రాయితీ ఇచ్చి పన్నులు కట్టించుకుంటుంటారు. నగరంలో చాలామందికి ఇది బాగా అలవాటైంది. వడ్డీ అన్నా మిగులుతుందని చాలామంది రెండు, మూడేళ్లకొకసారి ఇంటి పన్నులు కడుతుంటారు. ఈ ఏడాది అలాంటి వడ్డీ మాఫీ ఆశాజీవుల ఆశలపై నగరపాలక సంస్థ అధికారులు నీళ్లు చల్లారు. వడ్డీ మాఫీలేదని, వడ్డీతో సహా బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు జారీ చేశారు. బకాయిల వసూళ్లకు వినూత్న పోకడలు అవలంభిస్తున్నారు. పన్నులు కట్టని వారి ఇళ్ల ముందు చెత్త పోయడం వంటి చెత్తపనులు విమర్శలకు గురయ్యాయి. మొత్తానికి వడ్డీ మాఫీ కాకుండా ఆస్థి పన్ను బకాయిలు చెల్లించాల్సి రావడంతో బకాయిదారులు మధనపడుతున్నారు.

# జడ్పీ గెస్ట్‌హౌస్ ప్రారంభం

నెల్లూరులోని జడ్పీ గెస్ట్‌హౌస్ ఆధునీకరణకు నోచుకుని, ఎట్టకేలకు తిరిగి ప్రారంభమైంది. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఈనెల 15న దీనికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు ఎనిమిది సంవత్సరాల నుంచి ఇది మూతపడివుందని, తాను జడ్పీ ఛైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, ఈ గెస్ట్‌హౌస్‌ను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేశామని తెలిపారు. గెస్ట్‌హౌస్‌లో వున్న పాతసామగ్రిని విక్రయించి, రూ.30లక్షలు వెచ్చించి ఆధునీకరించామన్నారు. గెస్ట్‌హౌస్‌లో ఆరు సూట్లు సిద్ధం చేశామన్నారు. వీటికి సంబంధించి అద్దెను రోజుకు రూ. 500గా నిర్ణయించామన్నారు. కాగా, నగరానిక వచ్చే జడ్పీ సభ్యులకు అందుబాటులో వుండేవిధంగా, అన్ని వసతులతో కూడిన ఈ గెస్ట్‌హౌస్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావడం ఎంతైనా అభినందనీయమని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, జడ్పీ సిఇఓ ఎం.జితేంద్ర, డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ భారతీరెడ్డి, జడ్పీటిసి సభ్యులు, ఎంపిపిలు, అధికారులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి రూ.లక్ష



నెల్లూరుజిల్లా ఏఎస్ పేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేసిన కాకాణి ఉదయ్‌కుమార్ గత యేడాది రైలు ప్రమాదంలో మృతి చెందాడు. అతనికి రావాల్సిన ఎక్స్‌గ్రేషియా రూ.లక్ష చెక్కును ఉదయ్‌కుమార్ తల్లి కాకాణి వెంకటసుబ్బమ్మకు సోమవారం జిల్లా ఎస్పీ యస్.సెంథిల్‌కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు కార్యాలయం ఏఓ రాజశేఖర్, సూపరింటెండెంట్ సులోచన, సుబ్రహ్మణ్యం, పోలీసు అధికారుల సంఘ అధ్యక్షులు ప్రసాదరావు పాల్గొన్నారు.

# ఏసీకి నివాళి


మాజీమంత్రి స్వర్గీయ ఏ.సి.సుబ్బారెడ్డి 109వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కాంగ్రెస్ నాయకులు నెల్లూరు ఏసి సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొడవలూరు ధనుంజయరెడ్డి ఏ.సి.సుబ్బారెడ్డి చేసిన ప్రజాసేవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పత్తి రవీంద్రబాబు, సూరిశెట్టి నరేంద్ర, చెంగయ్య ఆచారి, ఆనం మహేష్‌రెడ్డి, ఆనం అబ్బాయిరెడ్డిలు పాల్గొన్నారు.



# అమరజీవి జయంతిని విస్మరించిన ప్రభుత్వం

పొట్టి శ్రీరాములు 115వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని, తెలుగు మాట్లాడే వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని 58రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి అశువులు బాసిన పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని నూతన అసెంబ్లీ ఆవరణలో పెట్టాలని పొట్టి శ్రీరాములు అవార్డు గ్రహీత కె.వి.చలమయ్య డిమాండ్ చేశారు. పొట్టి శ్రీరాములు 115వ జయంతి సందర్భంగా సోమవారం ఆత్మకూరు బస్టాండు వద్ద వున్న శ్రీ పొట్టి శ్రీరాములు కాంస్య విర్గహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటిమేయర్ ముక్కాల ద్వారకానాథ్, తిరివీధి ప్రకాశరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# తోపుగుంటను దత్తత తీసుకున్న డిఐజి దామోదర్



ప్రతి అధికారి ఓ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుకు స్పందించి ప్రొహిబిషన్ & ఎక్సైజ్ డైరెక్టర్ (డిఐజి) ఈతముక్కల దామోదర్ నెల్లూరుజిల్లా కలువాయి మండలంలోని తోపుగుంట గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దేందుకు దత్తత తీసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం ఆయన నెల్లూరుజిల్లా ఎస్పీగా పనిచేయడం తెలిసిందే! నెల్లూరుజిల్లాతోనూ, ఇక్కడున్న పలువురు ప్రముఖులతోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. తోపుగుంటకు చెందిన ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య ఆయనకు మంచి మిత్రుడు. స్నేహితుల సూచన మేరకు ఆయన తోపుగుంటను దత్తత తీసుకున్నారు. ఈ నెల 16వ తేదీన ఆయన తోపుగుంట గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తానని, విద్యా వైద్యం అందరికి అందుబాటులో వుండేలా చేస్తానని, గ్రామంలో తాగునీరు, సాగునీరు సమస్యను తీరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. గ్రామంలో మూడుపంటలు పండేందుకు అవసరమైన నీటివనరులను కల్పించేందుకు రిజర్వాయర్ నిర్మిస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వంతో సంప్రదించి 2.40కోట్ల నిధులు మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కూడా ఆయనతో పాటు పాల్గొన్నారు. తమ గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో తోపుగుంట వాసులు దామోదర్‌కు అభినందనలు తెలిపారు.

# సింహపురి ఉద్యోగుల ఖ్యాతిని చాటాలి



నెల్లూరుజిల్లా స్థాయి రెవెన్యూ క్రీడల్లో విజేతలుగా నిలిచిన ఉద్యోగులు వచ్చే నెలలో వైజాగ్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడల్లోనూ తమ సత్తా చాటుకుని సింహపురి ఉద్యోగుల ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో చాటాలని జిల్లా కలెక్టర్ ఎం.జానకి పిలుపునిచ్చారు. నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి రెవెన్యూ క్రీడా సాంస్కృతికోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ పోటీల్లో 210పాయింట్లు సాధించిన జిల్లా కలెక్టరేట్ రెవెన్యూ ఉద్యోగుల జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ముగింపు సభలో ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఎం.జానకి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులంతా ఒకే కుటుంబంలా కలసిమెలసి క్రీడాస్ఫూర్తితో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. విధుల్లో మరింత చురుగ్గా పాల్గొనేందుకు క్రీడలు, వ్యాయామం దోహదం చేస్తాయన్నారు. ప్రతియేటా రెవెన్యూ ఉద్యోగుల క్రీడాపోటీలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్, అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్, రాష్ట్ర వీఆర్వోల సంఘం అధ్యక్షుడు భక్తవత్సలనాయుడు, రాష్ట్ర మునిసిపల్ శాఖామంత్రి ఓయస్‌డి పెంచలరెడ్డి, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో తైవాన్ ప్రతినిధులు



తైవాన్ దేశానికి చెందిన ఉన్నతస్థాయి వ్యాపార ప్రతినిధుల బృందం గురువారం శ్రీసిటీలో పర్యటించింది. ఆ దేశానికి చెందిన ఎలక్ట్రానిక్ పరిశ్రమల సంఘ అధ్యక్షులు ఫ్రాన్సిస్ త్సా నేతృత్వంలో విచ్చేసిన బృందంలో ఆ పరిశ్రమలకు సంబంధించిన ప్రముఖులు సభ్యులుగా ఉన్నారు. అతిథుల బృందానికి శ్రీసిటీ ఫౌండేషన్ అధ్యక్షులు రమేష్ సుబ్రహ్మణ్యం సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీలో ఏర్పరచిన అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల గురించి, జపాన్ దేశ పరిశ్రమలకు గాను అవసరమైన అన్ని వసతులతో ప్రత్యేకంగా ఏర్పరచిన ప్రదేశం యొక్క విశేషతను, వివిధ పారిశ్రామిక యూనిట్ల గురించి, శ్రీసిటీ సాధించిన ప్రగతి గురించి ఆయన వారికి వివరించారు. తరువాత వారంతా శ్రీసిటీలోని వివిధ ప్రదేశాలలో పర్యటించి, కొన్ని పరిశ్రమలను సందర్శించారు.

## సింహపురిని సంగీత సాగరంగా మార్చిన

# శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ స్వర్ణోత్సవాలు





స్వర్గీయ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి, స్వర్గీయ డా॥ యనమండ్ర వెంకటేశ్వరశాస్త్రిలు భిక్షాటనా పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభను స్థాపించి 50సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీ త్యాగరాజస్మరణ స్వర్ణోత్సవాలు నెల్లూరు టౌన్‌హాలు ఓపెన్ ఆడిటోరియంలో ఈ నెల 9వ తేదీ నుండి 17వ తేదీ వరకు వైభవంగా జరిగాయి.

10వ తేదీ ప్రపంచ ప్రఖ్యాత కర్నాటక సంగీత విద్వాంసులు, సినీ గాయకులు డా॥ కె.జె.ఏసుదాసు గాత్ర కచ్చేరి వీనుల విందుగా సాగింది. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ, పద్మభూషణ్ డా॥ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం దంపతులు పాల్గొన్నారు. వేలాది మంది భక్తజనులు, సంగీతాభిమానుల మధ్య ఏసుదాసు ఆలపించిన కీర్తనలు వీనులవిందుగా సాగాయి. సంగీతానికి కులమత వర్గ భేదాలు లేవు. ప్రఖ్యాత గాయకులు ఏసుదాసు రావడంతో సింహపురి పులకించిపోయింది. కిక్కిరిసిన ప్రేక్షకులతో సభాప్రాంగణం నిండిపోయింది. ఈ ఒక్క కార్యక్రమాన్ని వివిఆర్ కళాశాల మైదానంలో నిర్వహించి వుంటే సింహపురి జిల్లావాసులు తనివితీరా ఏసుదాసు గానలహరిని వీక్షించేవారని భక్తులు, సంగీతాభిమానులు అభిప్రాయ పడ్డారు. ఏసుదాసు అమృతగానాన్ని ఆలకించే అవకాశాన్ని కేవలం కొన్ని కులాలకీ, వర్గాలకే పరిమితం చేయడం పట్ల సంగీత ప్రియులు అసంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో డా॥ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం దంపతులు, డా॥ వై.నాగదేవీప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం తల్లి శకుంతలమ్మను కమిటీ సభ్యులు సత్కరించారు.

# కృష్ణపట్నం పోర్టుకు ప్రతిష్ఠాత్మక అవార్డు




దేశంలోనే పెద్ద పోర్టుగా రూపాంతరం చెందుతున్న నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టుకు 2014సంవత్సరానికి గాను భారత పరిశ్రమల సమాఖ్య(సిఐఐ) పర్యావరణ సంరక్షణ, ఆరోగ్య భద్రత అవార్డును అందజేసింది.

ఈ నెల 14న చెన్నైలో జరిగిన సిఐఐ 8వ వార్షికోత్సవంలో కృష్ణపట్నంపోర్టు కంపెనీ టెర్మినల్ డైరెక్టర్ వినీత్ వెంకటేషన్ ఈ అవార్డును అందుకున్నారు. పోర్టు నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, భద్రత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కృష్ణపట్నం పోర్టుకు సిఐఐ త్రీస్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. దక్షిణ భారత దేశం నుండి ఈ అవార్డుకు 130పరిశ్రమలు పోటీలో నిలవగా కృష్ణపట్నం పోర్టుకు ఇది దక్కడం విశేషం.

# దండాలమ్మా... ముత్యాలమ్మ!





నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో కొలువైవున్న శ్రీముత్యాలమ్మ జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ముత్యాలమ్మ దేవస్థానాన్ని విద్యుద్దీపాలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. గంగమిట్ట మీద పోలేరమ్మను పూరిగుడిసెలో నిలువుదల చేశారు. బుధవారం ఉదయం పోలేరమ్మను ప్రతిష్ఠించారు. కోట మండలం సిద్ధవరంలో కుమ్మరి ఇంట తయారైన పోలేరమ్మ విగ్రహాన్ని డప్పులు, పంబలోళ్ల వాయిద్యాల నడుమ తూర్పుకనుపూరుకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం పోలేరమ్మకు కుంభం పోసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి ఊరేగింపు కొనసాగుతున్నంతసేపు భక్తులు చీరలను పంచి గణాచారి తీసుకొస్తున్న అమ్మవారిని నడిపించారు. మహిళా భక్తులు వరుసడడంతో వారిని దాటుకుంటూ ఊరేగింపు సాగింది. రెండోరోజు బుధవారం భక్తుల రద్దీ ఎక్కువైంది. దూర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలి రావడంతో ఆలయ పరిసరాలు ముత్యాలమ్మ నామస్మరణతో మార్మోగాయి. పోలేరమ్మ మట్టి ప్రతిమతో పాటు సత్తి పోలేరమ్మ, అంకమ్మ, సిద్దలయ్య పరుశురాముడు విగ్రహాలను ఊరేగించారు. సాయంత్రం యార, శ్రీ గురునాథస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గొల్లల వేడుకల్లో భాగంగా గంగపెట్టి, వీరతాళ్లతో వీధుల్లో తిరిగారు. జాతరలో భాగంగా గురువారం ఉదయం గురునాథస్వామి గ్రామోత్సవం, రాత్రి అమ్మణ్ణి ఉయ్యాల సేవ కనులవిందుగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, సినీ సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వరిదిరెడ్డి రామమోహన్‌రెడ్డి, సభ్యులు ఒబ్బాయి శివకుమార్, చిట్టేటి నారాయణ, భీమిరెడ్డి మదన్‌కుమార్‌రెడ్డి, సింహాద్రి మదన్‌మోహన్, దువ్వూరు రామచంద్రారెడ్డి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, కార్యనిర్వాహణాధికారి తాతా శ్రీనివాసరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ శ్రీనివాసులురెడ్డి చిల్లకూరు ఎస్సై దశరథరామారావు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## సిరామిక్ కాలేజీలో స్వచ్ఛభారత్



గూడూరులోని ప్రభుత్వ సిరామిక్ కాలేజీలో బుధవారం నాడు స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రిన్సిపాల్ సి.నరేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. కాలేజీ ఆవరణంలో ఉన్న చెత్తను, పిచ్చి చెట్లను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కె.వెంకటేశ్వరరావు, హెచ్ఓడి కె.సుబ్బారావు మరియు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరామిక్ కాలేజీ విద్యార్థులను ఉదయం, రాత్రి పూటల్లో కాలేజీలో స్టడీ హవర్స్ పెట్టి చదివిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు భవిష్యత్తులో ముందుకు పోవాలని వారు ఈ సందర్భంగా కోరారు.

## విద్యుత్తు కార్మికులంతా ఐక్యంగా ఉండాలి

విద్యుత్తు కార్మికులంతా ఐక్యంగా ఉంటే సమస్యలను పరిష్కరించుకోవచ్చని గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. మండలంలోని నెల్లటూరు గ్రామంలో వున్న డిస్కం కార్యాలయంలో సోమవారం తెలుగునాడు విద్యుత్తు కార్మికసంఘం ఆధ్వర్యంలో పతాక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సిఎం చంద్రబాబు హయాంలో 24గంటల విద్యుత్తును సరఫరా చేస్తున్నారన్నారు. దీనికంతటికి కారణం విద్యుత్తు కార్మికులేనని స్పష్టం చేశారు. రేయింబవళ్ళు కష్టపడుతున్న కార్మికులు తమ సమస్యల పరిష్కారంలోనూ ఐక్యతగా ఉండి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిస్కం డిఇ ఇస్మాయిల్, పలువురు సంస్థ ప్రతినిధులు సమావేశంలో ప్రసంగించారు.



జెండా ఆవిష్కరిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన

## సేల్స్‌టాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఏకగ్రీవ ఎన్నిక



ఏవియస్ కృష్ణమోహన్



కోట సునీల్‌కుమార్


సేల్స్‌టాక్స్ ప్రాక్టీషనర్స్, టాక్స్ కన్సల్టెంట్ అసోసియేషన్ ఏపి రాష్ట్ర అధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన ఏవియస్ కృష్ణమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జోన్ ఉపాధ్యక్షుడిగా గూడూరుకు చెందిన కోట సునీల్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో వీరిని ఎన్నుకున్నట్లు తెలిపారు.

## దోభీఘాట్‌కు స్థలంను కేటాయించండి



చేవూరు విజయమోహన్‌రెడ్డి, రజకుల ధర్నా

గూడూరు గ్రామీణ ప్రాంతం పరిధిలోని చెన్నూరు గ్రామంలో అత్తిమడుగులోని శ్మశాన వాటిక స్థలం పక్కనే ఎన్నో ఏళ్లుగా రజకులు దుస్తులు ఉతుకుతున్నారని, ప్రస్తుతం ఆ స్థలాన్ని కొందరు ఆక్రమించారని ఆరోపించారు. తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో తొలగించారని, తిరిగి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చేవూరి విజయమోహన్‌రెడ్డి, రజకులు,తెలుగుదేశం పార్టీ నాయకులు కలసి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ స్థలాన్ని దోభీఘాట్‌కు కేటాయిస్తే నిర్మాణం చేసుకుంటామని ఫిర్యాదులో పేర్కొన్నారు.



శ్రీకాళహస్తి వాస్తవ్యులు శ్రీ సానె రవికుమార్ - శ్రీమతి గీతల ఏకైక కుమార్తె **ఇందిరా ప్రియదర్శిని - కిరణ్ కుమార్** (శ్రీకాళహస్తి బహదూర్‌పేట వాస్తవ్యులు సారాయి వెంకటముని - శ్రీమతి సారాయి భారతీ దేవి గార్ల కనిష్ఠ కుమారుడు)ల వివాహం ఈనెల 12వ తేదీ శ్రీకాళహస్తి పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో వైభవంగా జరిగింది. నూతన జంటకు 'లాయర్' శుభాకాంక్షలు.

### ఆత్మకూరులో
## అరుదైన మోకాలి శస్త్ర చికిత్స



అధునాతన వైద్యానికి ఆత్మకూరు వేదికవుతోంది. గ్రామీణ మెట్ట ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా స్థానిక అభిరాం స్పెషాలిటీ హాస్పిటల్ ఉన్నత ప్రమాణాలను పరిచయం చేస్తోంది. ఇందులో భాగంగా మోకాలి చిప్ప మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ వ్యవస్థాపకులు, వైద్య దంపతులు డాక్టర్ శ్రావణ్, దీప్తిలు విలేఖరుల సమావేశం నిర్వహించారు. వారు తెలిపిన వివరాల మేరకు.. వింజమూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంకు చెందిన బండారు మంగమ్మ దీర్ఘకాలంగా మోకాలి నొప్పితో బాధ పడుతోంది. తమ ఆసుపత్రిలో ఎముకలు, నరాలు, కీళ్ళ స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ శ్రీనివాసులు పరీక్షించి మోకాలి చిప్ప అరిగిపోయినట్లు నిర్ధారించారు. శస్త్ర చికిత్స నిర్వహించి కృత్రిమ మోకాలి చిప్పను అమర్చారు. అయిదు రోజులు పూర్తవడంతో మంగమ్మ వాకర్‌తో నడుస్తున్నారు. తన స్వగ్రామమైన ఆత్మకూరు, పరిసర ప్రాంత ప్రజలకు వైద్యసేవలందించడమే లక్ష్యంగా ఈ హాస్పిటల్‌ను నెలకొల్పామని డాక్టర్ శ్రావణ్ తెలిపారు. ఇందుకోసం లాభాపేక్షను పక్కన పెట్టి అత్యాధునిక శస్త్ర చికిత్సలు, అందుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచామన్నారు. పేదలకు సైతం ఈ సేవలు విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎన్టీఆర్ ఆరోగ్య సేవా పథకం (ఆరోగ్యశ్రీ) కూడా అందుబాటులోకి తెచ్చామని వివరించారు.

## సాయిబాబా మందిరంలో ఉచిత వైద్యశిబిరం

గూడూరు శ్రీ షిర్డిసాయినగర్‌లో వున్న సాయిబాబా మందిరంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. డాక్టర్లు సిఆర్ రెడ్డి, సి.జనార్ధన్‌రెడ్డి, సి.రోహిణి పేదలకు ఆరోగ్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శ్రీసాయిబాబా మందిరం నిర్మించి 30 సంవత్సరాలయిందని, 25సంవత్సరాల నుండి నిత్య అన్నదానం చేస్తున్నట్లు, గత 15సంవత్సరాల నుండి శ్రీ సాయిబాబా మందిరంలో ప్రతి మొదటి మూడు ఆదివారాలు పేదలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సి.రోహిణి 'లాయర్'కు తెలిపారు. సుమారు 200మంది దాకా ఆరోగ్య పరీక్షలు జరిపామని, క్యాన్సర్ వ్యాధి గురించి ముఖ్యంగా ఆడవాళ్లకు రొమ్ము, గర్భసంచిలో వస్తున్నందున తొలిదశలో జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చని, క్యాన్సర్ వ్యాధికి 10 సంవత్సరాల నుండి 40సంవత్సరాల వరకు వ్యాక్సిన్ వుందన్నారు. గర్భశివు అమ్మాయి అయితే చాలామంది అబార్షన్లు చేయించుకొనేందుకు మొగ్గు చూపుతున్నారని, దీనిని ఆడవాళ్లే ప్రోత్సహిస్తున్నారని, దీనివల్ల ఆడవాళ్ళ సంఖ్య తగ్గి మొగవారి సంఖ్య పెరిగిపోతోందని, దీనిని నివారించాల్సింది ఆడవాళ్లేనన్నారు. ప్రతి ఒక్కరూ కన్నులు వైద్యనిపుణులు దగ్గర సురక్షితంగా చేసుకోవాలని డాక్టర్ రోహిణి సూచించారు.



ఆరోగ్య పరీక్షలు జరుపుతున్న డా॥ సి.రోహిణి

## పరిశ్రమలకు భూములు

గూడూరు రెవెన్యూ డివిజన్‌లో పరిశ్రమల స్థాపనకు పదివేల ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తించినట్లు ఆర్డీవో రవీందర్ తెలిపారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నాడు జరిగిన గ్రీవెన్స్ డే సందర్భంగా ఆర్డీవో వివరాలు తెలియజేశారు. డివిజన్‌లో పరిశ్రమల ఏర్పాటుకు భూములు గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఈమేరకు భూముల వివరాలతో నివేదిక పంపినట్లు తెలిపారు.

## డిఎస్పీలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

*- గుంటూరు రేంజ్ ఐజి ఎన్.సంజయ్*

డిఎస్పీలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, అసాంఘికశక్తుల ఆటకట్టించాలని గుంటూరు రేంజ్ ఐజి ఎన్.సంజయ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నెల్లూరులోని నగర డిఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ, ఏఎస్పీ, డిఎస్పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి డిఎస్పీ తన సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించాలని, వారానికి ఒక్కో పోలీస్‌స్టేషన్‌ను ఎంపిక చేసుకుని రాత్రి వేళ అక్కడ బస చేసి సిబ్బంది తీరుతెన్నులను గమనించాలని, ఆయా ప్రాంతాల్లో రాత్రి గస్తీని నిర్వహించాలని ఆయన సూచించారు. అనేకమంది సిబ్బందికి చట్టాలపై పూర్తి అవగాహన వుండడం లేదని, అలాంటి వారికి విధుల పట్ల, చట్టాల పట్ల అవగాహన వుండేవిధంగా తర్ఫీదు ఇవ్వాలని, వారికి తెలియని విషయాలను తెలియజెప్పాలని ఐజి సూచించారు. అందరూ క్రమశిక్షణతో విధులు నిర్వహించేలా చూడాలన్నారు. సిబ్బంది యోగక్షేమాలపై కూడా శ్రద్ధ చూపాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను, అసాంఘికశక్తులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని, అక్రమరవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలని, విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిడులకు లొంగకుండా బాధితుల పక్షాన నిలచి న్యాయం చేయాలని ఆయన పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్, ఏఎస్పీ రెడ్డి గంగాధర్, డిఎస్పీలు ఎస్.మగ్బుల్, తిరుమలేశ్వరరెడ్డి, మోహన్‌రావు, సుబ్బారెడ్డి, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

# ఇది మన్మధనామ సంవత్సరం

బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు



మన భారతీయ వేద సంస్కృతిలో వేదవాఙ్మయము సర్వోత్కృష్టము. అది ఋక్యజుస్సామ అధర్వణములను నాలుగు భేదములతో సృష్టి ఉనికిని కాపాడుతున్నది.

*"ప్రత్యక్షేణానుమిత్యావా। యస్తూపాయోనలభ్యతే।*
*ఏతం విదంతి వేదేన। తస్మాద్వేదస్యవేదతా॥"*

ప్రత్యక్ష అనుమానాదులచే తెలియబడని దానిని తెలియజేయునది వేదం. దీని అర్థబోధకుషడంగముల జ్ఞానము అవసరము. శిక్షవ్యాకరణము ఛందస్సు నిరుక్తము జ్యోతిషం కల్పము అనేవి వేదాలకు షడంగములు. మానవుడికి పాదాలు చేతులు ముఖము నాసిక నేత్రములు శ్రోతములు ఎంతటి ముఖ్యమైన అవసరములో వేదవాఙ్మయానికి పైన చెప్పిన 6 శాస్త్రాలు అవసరమే.

*ఛందఃపాదౌ శబ్దశాస్త్రం చవక్త్రం। కల్పంపాణీ జ్యోతిషం చకుషీచ।*
*శిక్షాఘ్రాణం శ్రోత్రముక్తం నిరుక్తం। వేదస్యాంగా న్యాహురేతాని షట్చ॥*

వేదవాఙ్మయానికి చంధస్సు పాదస్థానం. వ్యాకరణం ముఖం కల్పము చేతులు. జ్యోతిషం నేత్రాలు. శిక్షా నాసిక. నిరుక్తం శోత్రములని చెప్పబడినవి.

ఐదవదియగు ఈ జ్యోతిశ్శాస్త్రం మహాపుణ్యము అగు శాస్త్రము. కంటికి కనబడుతున్నా అతి రహస్యవిషయాలు కలది. సూర్యచంద్రులు దీనికి సాక్షి భూతులు. శ్రౌతస్మార్త కర్మలకు సాక్షీభూత స్థానమైనది. వేదములందు నిక్షిప్తమై "సూర్యుడు, బ్రహ్మ, వ్యాస, వశిష్ఠ, అత్రి, పరాశర, కశ్యప, నారద, గర్గ, మరీచి, మను, ఆంగిరస, లోమశ, పౌలశ, చ్యవన, యవన, మను శౌనకులను 18మంది మహర్షులచే వ్యాప్తి కల్పింపబడిన శాస్త్రమిది. వీరిలో ప్రధమండు సూర్యుడు. సూర్య ప్రోక్తమగు సిద్ధాంతమునే పరమప్రమాణముగ స్వీకరించి కాళిదాసు మహాకవి జ్యోతిర్విద్యాభరణ మనే గ్రంథములో వివరించాడు.

షట్శాస్త్రములలో 5వది కాబట్టి దీనిని పంచమాతమన్నారు. అదే పంచాంగముగ పిలవబడుచున్నది. మరియు తిథి వారము నక్షత్రము యోగము కరణము అనునవి పంచాంగము పేరుతో వ్యవహరింపబడుచున్నవి. ఈ ఐదింటి వలన జీవకోటికి ప్రయోజనమున్నది.

*తిథేశ్చ శ్రియమాప్నోతి, వారాదాయుష్యవర్ధనమ్*
*నక్షత్రాత్ హరతేపాపం, యోగాద్రోగ నివారణమ్*
*కరణాత్కార్యసిద్ధిశ్చ। పంచాంగస్య ఫలం త్విదమ్*
*కాలవి త్కర్మకృద్ధీమాన్ దేవతానుగ్రహం లభేత్.*

కాబట్టి పంచాంగ శ్రవణము చేసిన పాపము నశించును. ఈ పంచాంగము అనేది జ్యోతిశ్శాస్త్ర అంతర్గతము. అయితే దీని ప్రయోజనము ఏమిటంటే.

*జ్యోతిష్యాస్త్రాత్ జాయతే ఆయుషాదౌ। ఆయుర్జ్ఞానాత్ జాయతే ధర్మబుద్ధిః*
*ధర్మజ్ఞానాత్ ప్రాప్యతే బ్రహ్మవిద్యా। బ్రహ్మజ్ఞానాత్ ప్రాప్యతే మోక్షలక్ష్మి*

కావున ఇహపర సాధనమైన సత్కర్మ ఆచరింపవలసిన అవసరం ఉత్తమ జీవియగు మానవ ధర్మం కాబట్టి, అట్టి సత్కర్మాచరణకు వేదమే ఆధారం కాబట్టి, వేద భాగమైన జ్యోతిష్యః, జ్యోతిష దర్పనియైన పంచాంగము ప్రాముఖ్యానికి వచ్చింది. పంచాంగము కాల నిర్ణయాన్ని చేస్తుంది. ఈ కాలాన్ని సృష్ట్యాదిగ పరిశీలించితే...

**బ్రహ్మ పరమాయుర్ధాయము**

| | | |
|---|---|---|
| 17,28,000 | కృతయుగం | |
| 12,96,000 | త్రేతాయుగం | |
| 8,64,000 | ద్వాపరయుగం | |
| 4,32,000 | కలియుగం | |
| 43,20,000 | ఇది ఒక మహాయుగం | |
| X 71 = | ఒక మనువు పాలనకాలము (30,67,20,000) | |
| X 14 = | 14 మనువుల పాలన కాలము బ్రహ్మకు 1పగలు | |
| + 1 = | ఒక రాత్రి కలిపితే ఒకరోజు | 429,40,80,000 |
| | | 429,40,80,000 |
| | | 858,81,60,000 |
| X 360 = | బ్రహ్మకు ఒక సంవత్సరము | 309173,76,00,000 |
| X 100 = | **బ్రహ్మకు పరమాయుర్దాయము** | **30917376,00,00,000** |

మూడుకోట్ల, తొమ్మిదిలక్షల, పదిహేడువేల, మూడువందల డెబ్భైఆరు కోట్ల, కోట్ల సంవత్సరాలు బ్రహ్మకు పరమాయుర్ధాయము (ఇది మానవ సంవత్సరాల లెక్కలోనిది) ఇది సౌరాబద్ధములు. ప్రస్తుతము మనం బ్రహ్మ ఆయుర్దాయములో ప్రథమార్ధము గడిచి, ద్వితీయార్ధమున ప్రథమ దినమున 17ఘడియల 42విఘడియలు, ప్రాణాకాలం '0' గుర్వక్షరోచ్చార కాలము 3, నిమిషములు 19, లవత్రుటులు 3 గడవగా, నాల్గవ లవత్రుటిలో 2142732 సౌరమాసములు గడిచినది.

స్వాయంభువ, స్వారోచిష, స్వారోత్తమ, తామస, రైవత, చాక్షుష మన్వంతరములు గడిచి, వైవస్వత మన్వంతరంలో ఉన్నాము. ఇక సూర్యసావర్ణి, ధర్మసావర్ణి, దక్షసావర్ణి, రుద్రసావర్ణి, బ్రహ్మసావర్ణి, రౌచ్య, ధౌత్యమన్వంతరాలు గడవాలి. "యుగం భవేద్వత్సర పంచకేన యుగానితు ద్వాదశ వర్షపష్ట్యాం" అని సూర్య సిద్ధాంత ప్రమాణము. ఇది తైత్తరీయ బ్రాహ్మణంలో 10వ పాఠకములో 4వ అనువాకంలో ఉన్నది. 60సంవత్సరాలు ఎందుకు తీసికొన్నారంటే "కలౌషష్ఠిర్విధీయతే" అనునది ప్రమాణం. 60 దాటితే పునర్జన్మే రెండు 60సంవత్సరాలు పరమాయుర్ధాయము. ప్రస్తుతం వైవస్వత మన్వంతరములో 27మహాయుగాలు గడిచి 28వ మహాయుగంలో కలియుగం ప్రారంభై 5114సంవత్సరాలు గడిచినవి. ప్రస్తుతం 5115సంవత్సరం ఆరంభమైనది. "యుజ్యతే ఇతి యుగం." అందరిని ఒక చోట కలిపేది. అంటే అన్ని జీవరాశులను ఒక చోట కలిపేది. అన్ని జీవరాశులు సమానంగా కాలంలో కలుస్తాయి. "కలయతీతి కాలః" అనగా అన్నిటిని తనలో ఇముడ్చు కొనేది అని అర్ధం. కాలం నుండి ఋతువు లేర్పడినాయి. "ఋతుకర్తా ప్రభాకరః" ఋతు అంటే పరిణమించేది, గతించేది లేక చలించేది అని అర్థం. అటువంటి 60సంవత్సరాల కాలం (1)సంవత్సర (2)పరివత్సర (3) ఇదావత్సర (4) అనువత్సర (5) ఇద్వత్సరములుగా పరిగణింపబడును. ప్రస్తుతం వైవస్వత మన్వంతరములో శివదేవ తాకమయిన 6వ యుగము గడచుచున్నది. అందు ప్రజాపతి దేవతాకమైన అనువత్సర నామకమైన మన్మధ సంవత్సరము జరుగుచున్నది. ఈ సంవత్సరము ధాన్యదానము మహాఫలితమివ్వగలదు.

జ్యోతిశ్శాస్త్రమునందు లోకవ్యవహారము కొరకు మన దేశమున చంద్ర సూర్య బృహస్పతి మానవిలని మూడుగ ప్రధానముగా విభజించారు. తిరుమలగిరికి దక్షిణ ప్రాంతము సౌరమానమని, తిరుమలగిరి – వింధ్య పర్వతముల మధ్య ప్రాంతమును చాంద్రమానమని, వింధ్య పర్వతములకు ఉత్తర ప్రాంతము బార్హస్పత్యమానమని ప్రచారములోనున్నది. చాంద్రసౌర మానముల వారికి మన్మధనామ సంవత్సరము జరుగుతుంది. బార్హస్పత్యమాము వారికి "కీలక" నామసంవత్సరము జరుగుతుంది.

ప్రభవాది అరవై సంవత్సరములలో 29ది మన్మధనామ సంవత్సరము. యుగమనగా సంవత్సరము(కాలము) యుగము యొక్క ఆది అనగా ప్రారంభము, యుగాది అయినది. వ్యవహారములో "ఉగాది"గ పిలవబడుతున్నది. ఉగాది నాడు వారివారి వర్ణాచారాల ప్రకారం మంగళస్నానము చేసి, దైవాన్ని చిత్తశుద్ధితో ఆరాధించి, షడ్రుచులు కలవేప ప్రసాదాన్ని స్వీకరించి పంచాంగ విషయాన్ని తెలిసికొనవలసి ఉంటుంది. పంచాంగం ఎందుకు వినటం, తెలిసికొనడం జరగాలంటే

*శ్రీ కల్యాణ గుణావహం రిపుహరం*
*దుస్స్వప్న దోషాపహం*
*గంగా స్నానవిశేషపుణ్య ఫలదం*
*గోదానతుల్యం నృణాం*
*ఆయుర్వృద్ధిద ముత్తమం శుభకరం*
*సంతాన సంపత్ప్రదమ్*
*నానాకర్మ సుసాధనం సముచితాం*
*పంచాంగ మా కర్ణ్యతాం.*

ప్రతి సంవత్సరమునకు నవనాయకులని, 21మంది ఉపనాయకులని పిలవబడుతు గ్రహము కాలానికి శుభాశుభ ఫలితములనిస్తాయి. చైత్రశుక్ల పాడ్యమి వారాధిపతి రాజు, రవి మేష రాశి ప్రవేశ వారాధిపతి మంత్రి, రవి సింహరాశి ప్రవేశ వారాధిపతి సేనాధిపతి, రవి కర్కాటక సంక్రమణ ప్రవేశ వారాధిపతి స్యాధిపతి, ధనుర్మాస ప్రవేశవారాధిపతి ధాన్యాధిపతి, మిధున సంక్రమణ ప్రవేశ వారాధిపతి అర్ఘాధిపతి, ఆర్ధ్రకార్తె ప్రవేశ వారాధిపతి మేఘాధిపతి, తులా ప్రవేశ సమయవారాధిపతి రసాధిపతి, మకర ప్రవేశ వారాధిపతి నీరసాధిపతి అవినవనాయకులు, సహాయకులైన 21మంది ఉపనాయకులని పిలువబడుతారు. ముందుగా ఫలితాలు చూస్తే ఈ విధంగా ఉన్నాయి.



**మన్మధ సంవత్సర ఫలము:**

ఈ సంవత్సరము ప్రజలు నానావిధ భోగసౌఖ్యములను అనుభవించెదరు. అపరాలు, నలుపు పంటలు, పొట్టు ధాన్యాల దిగుబడి తగ్గి ధరలు పెరుగును. ఉత్తర ప్రాంతమున రాజకీయ కల్లోలము, ప్రజలకు అగచాట్లు ఉంటాయి. మన్మధ సంవత్సరాధిపతి శుక్రుడు కావున అధికార వర్గాల వల్ల ప్రభుత్వముకు ఇబ్బందులు, అధిక వర్షములు, రోగ ప్రాబల్యత కలదు.

**రాజు – శని :** రాజు శని అగుటవలన తగినంత వర్షాలు లేకపోవడం, రోగాల వల్ల జననష్టం, ఆకలి బాధలు దొంగతనాల సంఖ్య పెరగడం, రాజకీయ ఒడుదుడుకులు సర్దుబాటు కావడం, ధరలు నియంత్రింపబడుట, ప్రారంభము, చివరి దినములందు(సంవత్సరము యొక్క) మత సంబంధిత దాడులు జననష్టం ఉంటుంది. జనాన్ని అన్ని విధాల మోసం చేయడం జరుగుతుంది.

**మంత్రి – కుజ:** మంత్రి కుజుడగుట వలన ప్రజలలో వర్గ కొట్లాటలు, గృహదహనాలు, అతివృద్ధి అనావృష్టి వలన ఆర్థిక నష్టము కలగడం జరుగుతుంది. ప్రజానీకానికి వసతులు కల్పించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం, సమర్ధవంతమగు పరిపాలన సాగించడం, మంత్రాంగము సమన్వయము బాగుండుట జరుగును.

**సేనాధిపతి – కుజ:** ఆటంకవాదుల ప్రాబల్యం పెరుగుట, అక్కడక్కడ పంట నష్టాలు, దేశ రాష్ట్ర నాయకుల అకృత్యాలుండగలవు. సైనిక పటిష్ఠత, సైనిక సేవలు దేశానికి బాగుండగలవు. దేశ విద్రోహులను సమర్ధవంతంగా ఎదుర్కొనడం జరుగును.

**సస్యాధిపతి – శుక్ర:** సమస్త ధాన్యములు, పట్టు ఉన్న సుగంధద్రవ్యాలు తెల్లని భూములు ఫలించును. రైతులు ఆర్థికముగా గత సంవత్సరము కంటే బాగుపడుతారు. భూములు, పంట పొలాలు యొక్క క్రయవిక్రయాలు ఆలస్యం కాగలవు.

**ధాన్యాధిపతి – బుధుడు:** మేఘాల ఆడంబరం తప్ప సంతృప్తికరంగా వర్షాలుండవు. రస వస్తువులు పసుపు టెంకాయలు పండ్ల ధరలు, పప్పుదినుసుల ఉత్పత్తి బాగుంటుంది. స్వల్పంగా ధరలు పెరుగుతాయి.

**అర్ఘాధిపతి – చంద్ర:** ఆహారధాన్యాలు, నూనెలు, పాలు, పాలపదార్థాలు వెండి బంగారు కంచు బొగ్గులు, పెట్రోలు, సుగంధ ద్రవ్యాలు వస్త్రములు పొగాకు అభ్రకము పత్తి ధరలు కొద్దిగా పెరుగుతాయి. నిర్మాణ సామాగ్రి నీటి ధరలు పెరుగుతాయి.

**మేఘాధిపతి – చంద్రుడు:** ఋతుపవనాలు సకాలంలో వచ్చిన వర్ష విస్తారత కొన్ని ప్రాంతాల్లో, మేఘాడంబరం మాత్రమే వుండి కొన్ని ప్రాంతాలలో వర్షములు సరిగా ఉండవు.

**రసాధిపతి – రవి:** తేనె, చింతపండు, రసవస్తువులు, వేరుశెనగ, నెయ్యి, నూనె, మూరికారసములు, చింతపండు, గింజలెక్కువగా ఉండే రసఫలాలు, మామిడి ధరలు పెరుగుతాయి. శుష్క ఫలాల ధరలు కూడా పెరుగును.

**నీరసాధిపతి – శుక్రుడు:** ఆభరణాలు, నవరత్నాలు, కర్పూరం, చందనం బంగారు వెంటి వస్త్రములు ముత్యాలు అధికధరలు కలిగిన అందుబాటులో ఉంటాయి.

**వర్షలగ్న – జగల్లగ్నము:** ఉగాది ప్రారంభ సమయమున (పాడ్యమి ఘడియలు ప్రారంభము) గల గ్రహసంపత్తి, లగ్నమును బట్టి వర్ష లగ్నము ఫలితములు, సూర్యుడు మేషరాశి సమయమున గల లగ్నము గ్రహస్థితిని బట్టి జగల్లగ్నము నిర్ణయింపబడును. దీనిని బట్టి ప్రారంభమైన సంవత్సరములో దేశ రాష్ట్రముల ఫలితాలు ఉండును. యజ్ఞయాగాది క్రతులు బాగా జరుగుట, దైవపూజలు దేవాలయాలకు ప్రాశస్త్యముండును. రాష్ట్ర ప్రభుత్వము తరచు సమస్యల నెదుర్కొనుచు అభివృద్ధి పథములో సాగును. భూమి, పరిశ్రమలు విద్య పశు వృద్ధి గ్రామీణ వసతులు, సంక్షేమ పథకాలు నిరాటంకంగా సాగుతాయి. కేంద్ర ప్రభుత్వ నేతకు మంచి దైవానుగ్రహమున్నందున అందరి సహాయ సహకారముతో దేశ పురోభివృద్ధి సాధించును. రక్షణ దిశగా దేశ భద్రత పటిష్ఠముగానుండును. విద్యుచ్ఛక్తి, జల భూవనరుల ఉత్పాదకత, అధికారుల సమర్ధత, వేగముగ పీడిత ప్రాంతాలకు సహాయపడటం, విదేశ వాణిజ్యము వలన రాబడి బాగుంటుంది. రెండు ఉత్తరాది రాష్ట్రాల వల్ల కేంద్రప్రభుత్వం ఇబ్బందిపడుతుంది. మొత్తం మీద 5తుఫానుల తాకిడి దేశానికి ఉంటుంది. శాస్త్ర కళాకోవిధులు, న్యాయవేత్తలు, వైద్యులు, జ్యోతిష్కులకు మంచి గిరాకీ ఉంటుంది. క్రీడా చలనచిత్ర రంగాలు, మీడియాకు ప్రాబల్యం పెరుగుతుంది. వరదలు, వాహన ప్రమాదాల వల్ల జననష్టం ఎక్కువగా ఉంటుంది. ఎలక్ట్రానిక్ వస్తు వినియోగం పెరుగుతుంది. చేపలు కోళ్ళు రియల్ఎస్టేట్ రంగాల వారు జాగ్రత్తగా ఉండాలి. ప్రభుత్వాల మధ్య సమస్యలు పరిష్కారము కాగలవు. మొత్తం మీద దేశస్థితి రాష్ట్ర స్థితి గతంకంటే బాగుంటుంది.

**గోదావరి పుష్కరములు:** గురువు సింహరాశిలో ప్రవేశ సమయము నుండి గోదావరి నదికి పుష్కరములు ప్రారంభము. అనగా 14.7.2015 నుండి 25.7.2015వరకు పుష్కరాలు జరుగును. పితరులకు తర్పణాలు, పిండ ప్రదానాలు ఆచరించవలెను. ఉభయగోదావరి జిల్లాల నుండి ఉత్తరదిక్కు ప్రాంతాల్లో నివసించే వారికి శుభకార్యములు నిషిద్ధమని ధర్మసింధు ప్రమాణం.

**కర్తరీ నిర్ణయము:** తేది 11.5.2015 సోమవారం నుండి తేది 29.5.2015 వరకు కర్తరి జరుగును. "మృత్శిలాదారుకర్మాణి వర్జయేత్" అని గృహనిర్మాణ సంబంధ పనులు చేయరాదు.

**మౌఢ్యములు:** సూర్యునితో అత్యంత సమీపముకు శుభగ్రహములగు శుక్ర గురువులు వచ్చినచో గురు, శుక్రమౌఢ్యములని చెప్పబడును. తేది 13.8.2015 నుండి 9.9.2015వరకు గురుమౌఢ్యమి, 10.8.2015 నుండి తేది.20.8.2015 వరకు శుక్రమౌఢ్యమి జరుగును. అన్నప్రాశన, జనన శాంతులు తప్ప మరే శుభకర్మలు చేయకూడదు.

**మకర సంక్రమణము:** తేది.15.1.2016 శుక్రవారము ఉదయం గంట 6.45లకు సూర్యుడు మకర రాశిలో ప్రవేశించి ఉత్తరాయణపుణ్యకాలము ప్రారంభమగును. పితృదేవతలకు తర్పణములు, పిండప్రదానములు చేయుదురు.

*దక్షిణాయనగే భానౌ కలికాలే నరైఃకృతం*
*పాపం మూర్తీభవత్సర్వం బహిర్యా పృత్తరాయణే*

దక్షిణాయనంలో జనులు చేసిన పాపములన్ని ఘోరం రూపంలో మకరణ సంక్రమణ సమయంలో సూర్యాంశతో గ్రహతారలు ప్రత్యక్షమగు రూపమే మకర సంక్రాంతి పురుషరూపము.

మకర సంక్రాంతి పురుషుని లక్షణములను గమనించితే ధ్వాంక్ష నామధేయము. వరాహవాహనము వైశ్యులకు ఇబ్బంది, రాజకీయ నేతలకు బాధలు, స్త్రీలకు అశుభము, ఉత్తరదేశముకు ఉత్తరాది రాష్ట్రాలకు ఇబ్బందులు, అదుపులో ధరలు, సంవత్సరంలో 8నెలలు సౌఖ్యము, ప్రభుత్వ సుస్థిరత ఉంటుంది.

**ఆర్ధ్రకార్తె ప్రవేశము:** తేది. 22.6.2015 సోమవారము రాత్రి గంట 12.46లకు సూర్యుడు ఆర్ధ్రకార్తె ప్రవేశము. సస్యసమృద్ధి. కొన్ని రాష్ట్రాలలో జలప్రళయాలుండును.

**ఆషాఢమాసములు:** ఈ సంవత్సరము అదనముగా అధిక ఆషాఢ మాసము వచ్చి, సంవత్సరానికి రెండు ఆషాఢమాసములైనవి.

**ఆదాయ వ్యయములు – రాజపూజ్య అవమానములు**

| | ఆదాయము | వ్యయము | గౌరవము | అవమానము |
|---|---|---|---|---|
| మేష రాశి | 14 | 14 | 3 | 6 |
| వృషభ రాశి | 8 | 8 | 6 | 6 |
| మిధున రాశి | 11 | 5 | 2 | 2 |
| కర్కాటక రాశి | 5 | 5 | 5 | 2 |
| సింహ రాశి | 8 | 14 | 1 | 5 |
| కన్యా రాశి | 11 | 5 | 4 | 5 |
| తులా రాశి | 8 | 8 | 7 | 1 |
| వృశ్చిక రాశి | 14 | 14 | 3 | 1 |
| ధనుః రాశి | 2 | 8 | 6 | 1 |
| మకర రాశి | 5 | 2 | 2 | 4 |
| కుంభ రాశి | 5 | 2 | 5 | 4 |
| మీన రాశి | 2 | 8 | 1 | 7 |

## కళ్యాణ వైభవం...!



ముంగమూరు రాంసాగర్‌రెడ్డి - ఉషల కుమారుడు **అమృతేష్ రెడ్డి - దివ్య** (తిరుపతి వాస్తవ్యులు దొనపాటి లక్ష్మీనారాయణరెడ్డి - భారతీదేవిల కుమార్తెల కల్యాణం మార్చి 8వ తేదీ తిరుపతిలోని జిఆర్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లోనూ రిసెప్షన్ మార్చి 11వ తేదీ నెల్లూరు అనిల్ గార్డెన్స్‌లోను జరిగాయి. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# నీతికి సమాధి

ఆయన అత్యంత నిజాయితీపరుడు. ముక్కుసూటి మనస్తత్వం ఆయనది. బెదిరింపులకు జడిసే మనిషి కాదు. అక్రమార్కులకు ఆయనంటే టెర్రర్. వృత్తి పట్ల నిబద్ధతతో వ్యవహరించే యువ ఐఏఎస్ అధికారి. ఆయన పేరు డి.కె రవి. కర్నాటకలో వాణిజ్య పన్నుల శాఖలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న నిజాయితీకి మారుపేరైన అధికారి ఆయన. అలాంటి అధికారి మృతి చెందారన్న సమాచారాన్ని ఎవరూ జీర్ణించుకోలేక పోతున్నారు. కర్నాటకలోనే కాదు, దేశవ్యాప్తంగా ఈ సమాచారం పెద్ద కలకలమే సృష్టించింది.

ఆయన మృతి అందరికీ దిగ్భ్రాంతిని కలుగజేసింది.. అక్కడి ప్రజల్లో అలజడి రేపింది. పలుచోట్ల ప్రజలు స్వచ్ఛంధంగా ఆందోళనలు చేపట్టారు. రవి గతంలో కలెక్టర్‌గా పనిచేసిన కోలార్ జిల్లాలోనూ ప్రజలు ఆందోళనలు చేశారు. ఆయనను తలచుకుని అనేకమంది ప్రజలు కంటతడి పెట్టారు. అయినా, ఒక నిజాయితీ గల ఉన్నతాధికారి అలా బేలగా ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందాడంటే ఎవరూ విశ్వసించడం లేదు. ఇది ఆత్మహత్య కాదు.. హత్యేనన్న అనుమానాలూ సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్షాల ఆరోపణ కూడా అదే. అయితే, వాస్తవానికి ఈ ఘటన ఎలా జరిగిందో, ఎందుకు జరిగిందో విచారణలో తెలియాల్సి వుంది. 38 ఏళ్ళ ఐఏఎస్ అధికారి డి.కె రవి తన నివాసంలో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు ఈ నెల 16న పోలీసులు గుర్తించారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్నవారంతా ఒక్కసారి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. నిజాయితీతో-నిర్భీతితో కూడిన ఆయన నైజం తెలిసిన వారంతా ఈ ఘటనతో అవాక్కయ్యారు.. విషాదంలో మునిగిపోయారు. నీతికి సమాధి జరిగిందని, మంచికి మానవత్వానికి స్థానం లేకుండా పోతోందని అందరూ విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆయన మృతి సమాచారం శాసనసభను అట్టుడికించింది. ఈ ఘటనపై సిబిఐ విచారణ జరిపించాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేసినా రాష్ట్రప్రభుత్వం తిరస్కరించడంతో ప్రతిపక్షాలు నిరవధిక ధర్నా చేపట్టాయి. ఉభయసభలు ఆరోజు వాయిదా పడినా ప్రతిపక్షాలు మాత్రం ధర్నాలు ఆపలేదు. రాత్రంతా కూడా అక్కడే వున్నారు. రవి మృతిపై సిఐడి విచారణకు ఆదేశించామని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెల్లడించినా, ఈ ఘటన పట్ల సిబిఐ విచారణ చేపట్టాల్సిందేనని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. అందులోనూ ఆయన ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని అనేకమంది అభిప్రాయం. ఈ ఘటన ఎలా జరిగిందోనన్నదే అందరి అనుమానం. పన్ను ఎగవేతదారులకు డి.కె రవి పేరంటేనే హడల్. వాణిజ్య పన్నులు ఎగవేతకు ప్రయత్నించిన అనేక సంస్థలపై, ప్రముఖ స్థిరాస్థి, బిల్డర్లు, వజ్రాలు, స్వర్ణాభరణాల వ్యాపారసంస్థలపై ఆయన దాడులు జరిపి, కేవలం రెండు నెలల్లోనే దాదాపు రూ.129 కోట్ల పన్నులు వసూలు చేసి రికార్డు సృష్టించాడు. ప్రభుత్వానికి ఏటా రావాల్సిన వందల కోట్ల రూపాయల ఆదాయానికి గండి కొట్టడమే కాక, పర్యావరణానికి కూడా హాని కలిగిస్తున్న ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకున్నారు. కోలార్, బెంగళూరు ప్రాంతాల్లో అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టించాడు. కేవలం ఆరేళ్ళ సర్వీసులోనే అక్రమార్కులకు ఆయన సింహస్వప్నం అయ్యారు. ప్రజలచేత హీరో అనిపించుకున్నారు. భయమనే మాటే తన డిక్షనరీలో లేని ఉత్తమ అధికారి ఆయన. పన్ను ఎగ్గొడుతున్న మరికొన్ని సంస్థలపై కూడా దాడులు చేయాలని భావిస్తున్న తరుణంలో ఆయన మృతి అనుమానాస్పదంగా మారింది. రవి మృతి విషయం అటు కర్నాటక ఉభయసభల్లోనూ, పార్లమెంట్‌లోనూ ప్రస్తావనకు వచ్చిందంటే ఆయన వ్యక్తిత్వం..నిజాయితీ అలాంటివి. అలాంటి మంచి ఉన్నతాధికారి మరణించడం నిజంగా దురదృష్టం. కాగా, బిజెపి కర్నాటక శాఖ అధ్యక్షుడు ప్రహ్లాద జోషి, రవి అనుమానాస్పద మృతి విషయంపై పార్లమెంట్‌లో మాట్లాడుతూ, ఈ సంఘటనపై సిబిఐతో విచారణ జరిపించేందుకు ప్రభుత్వం ఎందుకు వెనుకంజవేస్తోందని గట్టిగా ప్రశ్నించారు. పలు స్థిరాస్థి సంస్థలపై రవి దాడులు చేశారని, వాటిలో రాష్ట్ర హోంమంత్రి భాగస్వామ్యం వున్న స్థిరాసి సంస్థ, రిసార్ట్‌లు కూడా వున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటన పట్ల అటు శాసనసభలోనూ, ఇటు లోక్‌సభలోనూ పెద్ద రగడే జరిగింది. రవి మరణం వెనుక కారణాలు ఏమైనప్పటికీ, ఇలాంటి ఉన్నతాధికారులను కోల్పోవడం దారుణం.. అత్యంత విచారకరం.

మంచి అధికారులను కాపాడుకోలేకపోవడం మన దౌర్భాగ్యం. ఇప్పుడే కాదు, నీతి, నిజాయితీగల అధికారులకు మనదేశంలో అడుగడుగునా గండాలే ఎదురవుతూ వున్నాయి. రకరకాల మాఫియాలు ప్రభుత్వాలను, పాలకులను సైతం శాసించే స్థాయికి ఎదిగిపోయాయి. తమ మాటను ధిక్కరించే వారిని మట్టుబెట్టే స్థితికి వచ్చాయి. గతంలోనూ నిజాయితీగల ఐఏఎస్, ఐపిఎస్ అధికారులపై పగబట్టిన దుండగులు కొందరు, నిజాయితీకి మారుపేరైన అధికారులను హతమార్చిన ఘటనలు కూడా ఎన్నో వున్నాయి. అవి నేటికీ ఇంకా పునరావృతమవుతూనే వుండడం దురదృష్టకరం. పాలకులు ఇప్పటికైనా ఇలాంటి ఘటనపట్ల తీవ్రంగా స్పందించాలి. దుండగలను కఠినంగా శిక్షించాలి. నిజాయితీని పొట్టనపెట్టుకునే అక్రమార్కుల, దుండగుల భరతం పట్టాలి. లేకుంటే, ఇక నీతికీ-నిజాయితీకి స్థానమే వుండదు. ఏదేమైనా, డికె రవి వంటి నిజాయితీగల అధికారిని కోల్పోవడం వారి కుటుంబానికీ, ఐఏఎస్ రంగానికే కాదు... దేశానికే పెద్ద లోటు.. ఒక్క మాటలో చెప్పాలంటే.. నిజాయితీకే తీరని లోటు!..

# ఔను... వాళ్లిద్దరికీ చెడ్డపేరొచ్చింది

***ఏ రంగంలోనైనా మంచిపేరు తెచ్చుకోవాలంటే కఠోరశ్రమ కావాలి. ఏళ్లతరబడి నిరీక్షణ ఉండాలి. నిరంతరం పోరాడాలి. ఇక రాజకీయ రంగంలో అయితే జీవితమే పోరాటంగా ఉండాలి. మనిషి త్వరగా మంచిపేరు తెచ్చుకోవడానికైనా, అతి తొందరగా చెడ్డపేరు తెచ్చుకోవడానికైనా రాజకీయం ఓ పెద్ద వేదిక.***

తమ జీవితకాలం సంపాదించిన మంచిపేరునంతా మన జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు ప్రస్తుతం పోగొట్టుకుంటున్నారు. తమ పనితీరు, ప్రవర్తన ద్వారా ప్రజల్లో చెడ్డపేరు తెచ్చుకుంటున్నారు. వారిలో ఒకరు కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు కాగా రెండోవారు రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి పి.నారాయణ.

కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుపై ఈమధ్యకాలంలో జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా కూడా తీవ్ర వ్యతిరేకత వస్తుంది. ఆయన కేంద్రమంత్రి అయితే నెల్లూరు జిల్లాకు ఏదో ఒరుగుతుందని ప్రజలు ఆశించారు. కాని ఏమీ ఒరగలేదు. ఏమీ జరగలేదు. ప్రత్యేకించి నెల్లూరుజిల్లా అభివృద్ధి కోసం పనిచేయాల్సిన బాధ్యత కూడా ఆయనకు లేదు. ఎందుకంటే ఈ జిల్లా ప్రజలు బీజేపీకి ఓట్లేయలేదు. వెంకయ్య ఈ రాష్ట్రం నుండి రాజ్యసభ సభ్యుడు కూడా కాదు. కాబట్టి ఆయన్ను ఖచ్చితంగా చేయాలని చెప్పి మనమూ అడగలేము. కాక పోతే వెంకయ్య తన ప్రసంగాలలో జన్మనిచ్చిన తల్లి, జన్మనిచ్చిన ఊరు గురించి చాలా గొప్పగా చెబుతుంటాడు కాబట్టి, ఆ విధంగా నెల్లూరుకు నాలుగు మంచిపనులు చేస్తాడేమోనని ఆశపడ్డారంతే! నెల్లూరుజిల్లాకు ఏమీ చేయలేదని ఈ జిల్లా ప్రజలు ఆయనపై అసంతృప్తి చెందుతున్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా కూడా వెంకయ్యపై వ్యతిరేకత వ్యక్తమవుతుంది. దీనికి కారణాలు లేకపోలేదు. గత యూపిఏ ప్రభుత్వంలో దారుణంగా తయారు చేసిన రాష్ట్ర విభజన బిల్లు రాజ్యసభకు వచ్చినప్పుడు ఆంధ్రప్రదేశ్ హక్కుల కోసం పోరాడింది వెంకయ్యనాయుడే! ఏపికి ప్రత్యేక హోదాతో పాటు మరికొన్నింటి మీద ఆయన పోరాడి రాజ్యసభలో ఆనాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ చేత వాటిపై హామీ ఇప్పించాడు. ఆరోజు వెంకయ్యను ఏపి ప్రజలంతా మెచ్చుకున్నారు. ఓట్లేసి గెలిపించిన కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేసినా, కర్నాటక నుండి రాజ్యసభ సభ్యుడిగా వున్న వెంకయ్య ఏపి పట్ల అభిమానం చూపాడనుకున్నారు. ఇప్పుడు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వమే. మోడీ కేబినెట్‌లో వెంకయ్య కీలక సభ్యుడు. విభజనతో అన్యాయానికి గురైన ఏపికి న్యాయం చేయడానికి వెంకయ్య ముందు అన్ని అవకాశాలున్నాయి. ముందు విభజన హామీలను అమలు చేయిస్తే చాలు. కాని వెంకయ్య హామీలను వదిలేసి, ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదంటూ ముందుగానే చెప్పేసాడు. విభజన బిల్లును పెట్టినప్పుడు రాజ్యసభలో ఏపికి ప్రత్యేక హోదాను 5ఏళ్లు కాదు పదేళ్లు ఇవ్వాలంటూ పోరాడింది వెంకయ్యనాయుడే! మరి ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వలేరనే విషయం వెంకయ్యకు ఆరోజు తెలియదా? రాష్ట్రం ఇప్పుడున్న గడ్డు పరిస్థితుల్లో వెంకయ్య ఇలాంటి మాటలు చెప్పడమేంటని రాష్ట్ర ప్రజలు మండి పడుతున్నారు.

నారాయణ విద్యాసంస్థల అధినేత పి.నారాయణ అంటే చదువులకే బ్రాండ్ అంబాసిడర్. విద్యారంగంలో అతని ఖ్యాతి హిమశిఖరాన్ని తలపించేది. ఒక సాధారణ కోచింగ్ సెంటర్‌తో మొదలుపెట్టి ఈరోజు దేశంలోని అన్ని రాష్ట్రాలలో కూడా తన విద్యాసంస్థలను వ్యాపింపజేసాడు. ఆయన విద్యారంగానికే పరిమితమై వుంటే ఆ మంచిపేరు అలానే నిలిచిఉండేది. కాని చంద్రబాబుతో ఉన్న సాన్నిహిత్యం, ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో 2014ఎన్నికలప్పటి నుండి తెరమీద కొచ్చాడు. చంద్రబాబు కేబినెట్‌లో పురపాలకశాఖ మంత్రి అయ్యాడు. నారాయణ విద్యాసంస్థల అధినేతగా వున్నంతకాలం జిల్లా ప్రజలు ఆయన నుండి ఏమీ ఆశించలేదు. కాని ఇప్పుడు జిల్లా నుండి ఆయనే మంత్రి. జిల్లాలో నాలుగు మంచిపనులు చేస్తాడని ప్రజలు బలంగా ఆశిస్తున్నారు. కాని నారాయణ మాత్రం జిల్లాకు ఉపయోగపడే విధంగా ఒక్క పనీ చేయడం లేదు. కనీసం తెలుగుదేశం కార్యకర్తలకు కూడా అందుబాటులో వుండడం లేదు. ఇక ప్రజల సంగతి సరే సరి. ప్రజల వద్దకు ఆయనొచ్చేదే లేదు. జిల్లా మంత్రిగా నారాయణ ఉన్నా లేనట్లే ఉందని ఆ పార్టీ కార్యకర్తలే వ్యాఖ్యానిస్తున్నారు.

కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు రాజ్యసభ ద్వారా, రాష్ట్ర మంత్రి పి.నారాయణ ఎమ్మెల్సీ ద్వారా మంత్రులయ్యారు. అంటే ప్రజల ఓట్లతో సంబంధం లేదు. కాబట్టి ప్రజల సమస్యలు కూడా వారికి పట్టనట్లే వ్యవహరిస్తున్నారనేది పలువురి అభిప్రాయం.

# చంద్రులకు ఝలక్

(మొదటిపేజీ తరువాయి)

చేరిన వారికి కూడా ఎమ్మెల్సీ ఇచ్చేది లేదని చెప్పాడు. ఇక్కడ నిఖార్సయిన తెలుగుదేశం నాయకులకు కొంత ఊపిరి వచ్చింది. ఈ కోణంలో బి.సి వర్గాల తరపున నెల్లూరుజిల్లాకు చెందిన బీద రవిచంద్ర పేరు తెరమీద కొచ్చింది. చంద్రబాబు నుండి సంకేతాలు కూడా రావడంతో బీద రవిచంద్ర నామినేషన్ పత్రాలు రెడీ చేసుకున్నారు. ఆఖరకు అసెంబ్లీకి పోయి నామినేషన్లు వేసేందుకు పాస్‌లు కూడా తెచ్చుకున్నాడు.

అయితే ఏమైందో ఏమోగాని చివరి నిముషాల్లో సీన్ మారిపోయింది. రవిచంద్ర పేరు వెనక్కుపోయింది. రవిచంద్ర నామినేషన్‌పత్రాలను తన స్వహస్తాలతో పూరించిన తిప్పేస్వామిని చంద్రబాబు ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేశారు. గత ఎన్నికలలోనే కాంగ్రెస్ నుండి తెలుగుదేశంలో చేరిన తిప్పేస్వామికి బిసి(యాదవ) కోటాలో సీటిచ్చారు. అనంతపురం జిల్లాకు చెందిన తిప్పేస్వామితో పాటు విశాఖ జిల్లా నుండి గుమ్మడి సంధ్యారాణిని తూర్పు గోదావరి జిల్లా నుండి వివివి చౌదరిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నిర్ణయించారు. కాంగ్రెస్ నుండి వచ్చిన వారికి ఎమ్మెల్సీ లేదన్న చంద్రబాబు, కాంగ్రెస్ నుండి వచ్చిన తిప్పేస్వామికి ఇచ్చాడు. గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు ఇచ్చేది లేదని మొదట చెప్పారు. తీరాచూస్తే 2014ఎన్నికల్లో అరకు నుండి పోటీ చేసి ఓడిపోయిన గుమ్మడి సంధ్యారాణికిచ్చారు. యాదవ కులంకే చెందిన తిప్పేస్వామికి ఎమ్మెల్సీ ఇవ్వడంతో ఇక ఆ వర్గానికే చెందిన రవిచంద్రకు కనుచూపు మేరలో ఎమ్మెల్సీ ఇవ్వడం గగనమే! ఏదైనా నామినేటెడ్ పదవితో ఆయనను బుజ్జగించే అవకాశాలున్నాయి.

***కథ ఎక్కడ అడ్డం తిరిగింది?...*** ఈ దఫాలో మీకు ఎమ్మెల్సీ లేదని సోమిరెడ్డికి ముందుగానే చెప్పారు. పార్లమెంటులో విభజన బిల్లుకు సవరణ చేయడం ద్వారా రాష్ట్రానికి 8ఎమ్మెల్సీలు అదనంగా వచ్చాయి. వీటిలో తెలుగుదేశంకు 5, వైకాపాకు 3 దక్కే అవకాశముంది. ఈ 5ఎమ్మెల్సీలలో మీకు అవకాశముంటుందని సోమిరెడ్డికి ముందే హామీ ఇచ్చారు. రవిచంద్రకు మాత్రం ఈ మూడు ఎమ్మెల్సీలలో ఒకటి ఖాయంగా చెప్పారు. నెల్లూరులో ఆయన ఇంటివద్ద షామియానాలు వేసి అనుచరులు సంబరాలకు సిద్ధమయ్యారు. కాని చంద్రబాబు చివరి నిముషంలో మార్చేసాడు. దీనికి ప్రధానకారణం ఒకటి వినిపిస్తుంది. మంత్రి పి.నారాయణ తన జిల్లాకు ఎమ్మెల్సీ కావాలని గట్టిగా పట్టుబట్ట లేదు. ఆయన నెల్లూరుకు బదులు ఉత్తరాంధ్ర జిల్లాలలో ఎమ్మెల్సీ ఇవ్వాలని పంతం పట్టాడు. గుమ్మడి సంధ్యారాణికి నారాయణ కోటాలోనే ఎమ్మెల్సీ వచ్చింది. ఇక బీద మస్తాన్‌రావు రాజ్యసభ రేసులో వున్నారు. రెండేళ్ల తర్వాతయినా రాజ్యసభ తనకు కావాలని మస్తాన్‌రావు గట్టిగా అడిగివున్నారు. ఇప్పుడు రవిచంద్రకు ఎమ్మెల్సీ ఇస్తే రేపు మస్తాన్‌రావు రాజ్యసభకు అది ప్రతిబంధకంగా మారే అవకాశముంది. ఒకే కుటుంబంలో ఇప్పుడు ఒకరికి ఎమ్మెల్సీ, రేపు ఇంకొకరికి రాజ్యసభ ఎలా ఇస్తారని, పార్టీలో దీనిపై వ్యతిరేకత రావచ్చని కోటరీలో కీలకనాయకుడొకరు చంద్రబాబు చెవిలో వూదారు. దీంతో చంద్రబాబు అప్పటికప్పుడు మనసు మార్చుకుని కాంగ్రెస్ నుండి వచ్చాడని కూడా చూడకుండా రవిచంద్ర స్థానంలో యాదవ కులానికే చెందిన తిప్పేస్వామిని ఎంపిక చేయడంతో... ఔరా... చంద్రబాబు రాజకీయం... అంటూ తెలుగుదేశం శ్రేణులే నిర్ఘాంతపోయాయి.

శ్రీను గల్పిక

# రాహుల్ కోసం బీజేపీ నేతల ఆరాటం

అది చీపురుకట్టలు రాజ్యమేలుతున్న ఢిల్లీ నగరం. బీజేపీ కార్యాలయం. ప్రధాని నరేంద్ర మోడీ, సీనియర్ నాయకులు అద్వానీ, మురళీమనోహర్ జోషీలతో పాటు కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, మనోహర్ పారికర్, స్మృతిఇరానీ, ప్రకాశ్ జవదేకర్, వెంకయ్యనాయుడు, ఆరెస్సెస్ చీఫ్ మోహన్‌భాగవత్‌లు కూర్చుని ఉన్నారు. అందరూ చాలా సీరియస్‌గా ఉన్నారు. అందరి ముఖాల్లోనూ ఆందోళన కనిపిస్తుంది. అంత గంభీర వాతావర ణంలో నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ నరేంద్ర మోడీ... ఇంతకూ అతను ఎక్కడకు పోయి ఉంటాడు? అని అందర్నీ ఉద్దేశించి ఒక ప్రశ్న వదిలాడు. దానికి రాజ్‌నాథ్‌సింగ్ స్పందించాడు. ఎక్కడకు పోయాడు, ఎక్కడున్నాడనే దానిపై ఇంతవరకు సమాచారం లేదు. ఆ కాంగ్రెస్ వాళ్లు మన కళ్లుగప్పి పంపించారు. అతని జాడను కనిపెట్టడానికి మన ఇంటెలిజెన్స్ సంస్థ 'రా'(రీసెర్చ్ అండ్ వింగ్ ఎనాలసిస్) తీవ్రంగా కృషి చేస్తుంది. అన్ని దేశాలకూ సమాచారం అందించాం. అతని ఫోటోలను కూడా పంపించాం. ఇంటర్‌పోల్‌తో టచ్‌లో ఉన్నాం, ఆఖరకు శత్రువైనా కూడా ఈ విషయమై పాకిస్థాన్ ఐఎస్ఐతో కూడా సంప్రదింపులు నిర్వహిస్తున్నామని చెప్పాడు. వెంకయ్యనాయుడు ఉండి... కాంగ్రెస్ అధిష్టానమే అతని విషయంలో ఏదో డ్రామా ఆడుతుంది. అతను సెలవు పెట్టి వెళ్లిపోయాడని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. భారతదేశ రాజకీయ చరిత్రలో 'సెలవులు' అనే మాటకే స్థానం లేదు. పార్లమెంటు సమావేశా లప్పుడు హౌస్‌కు రాకుండా ఎగ్గొట్టడం తెలుసుగాని, సెలవు పెట్టే సంప్రదాయం ఎప్పుడన్నా ఉందా అని అన్నాడు. అరుణ్‌జైట్లీ వుండి... ఒక్క విషయం మీద క్లారిటీ రావడం లేదు. మనం ఇంతగా టెన్షన్ పడుతున్న ఆ రాహుల్‌గాంధీని కాంగ్రెస్ అధి ష్ఠానమే సెలవు పెట్టి విదేశాలకు పొమ్మందా... లేక రాహుల్‌గాంధీయే ఏదైనా విషయం మీద అలిగి చెప్పా పెట్టకుండా వెళ్లిపోయాడా అనేది తెలియడం లేదన్నాడు. వెంటనే అద్వానీ అందుకుని... పార్టీ వ్యవహారాలలో అధిష్ఠానంతో అంటే తన తల్లి సోనియాతోనే ఆయన విభేదించి వెళ్లిపోయి ఉండ వచ్చునని సందేహం వ్యక్తం చేశాడు. అందుకు వెంకయ్య... రాహుల్‌కు అన్ని తెలివితేటలు లేవు. ఉండుంటే మనం ప్రతిపక్షంలో, కాంగ్రెస్ అధికార పక్షంలో ఉండేది. సొంత ప్రభుత్వం తయారుచేసిన ఆర్డినెన్స్ కాపీలనే అడ్డంగా చించేసి రికార్డు సృష్టించిన రాజకీయ నాయకుడు ప్రపంచం మొత్తం మీద ఎవరన్నా ఉన్నారంటే అతను రాహుల్‌గాంధీయే. కాబట్టి తన తల్లితో ఆయన రాజకీయంగా విభేదించే సమస్యే లేదన్నాడు. వెంటనే ప్రకాశ్ జవదేకర్... నాకు ఒకటనిపిస్తుంది, 44ఏళ్లు దాటినా ఆయనకింకా పెళ్లి చేయలేదు. ఈ విషయంలో తన తల్లిమీద అలిగి ఉంటాడనిపిస్తుందని అన్నాడు. వెంటనే వెంకయ్య... పెళ్లి చేయనందుకు అలగడమెందుకు? సంతోషపడాలిగాని, అతనికి పెళ్లి చేస్తే తెలుస్తుంది, తన తల్లి ఎంత ముందుచూపుతో ఆలోచించి ఇంతకాలం ఎందుకు పెళ్లి చేయలేదనే విషయం అని అన్నాడు. సుష్మాస్వరాజ్ అందుకుని... రాహుల్ మన లక్కీస్టార్, కాంగ్రెస్‌కు ఆయన ప్రచారసారధిగా ఉండబట్టే ఆయన ప్రచారం చేసిన అన్ని రాష్ట్రాల్లో మనం గెలుస్తూ వచ్చాం. ఈ ఎఫెక్ట్ మొన్న పార్లమెంటు ఎన్నికల్లో కూడా కనిపించింది. ఆయన ప్రచారం చేయని లోటేమిటో నిన్న ఢిల్లీ ఎన్నికల్లో కనిపించింది. రాహుల్ అక్కడ ప్రచారం చేయకపోబట్టే మనం ఢిల్లీ ఎన్నికల్లో ఓడిపోయామంది. నరేంద్ర మోడీ వుండి... అసలు రాహుల్ ఎక్కడకు పోయాడనే దానిపై మనకు క్లారిటీ రావాలి, ఇది టెన్‌జనపథ్ వాళ్లకే తెలుసు. కాబట్టి రహస్యంగా అక్కడకు వెళితే రాహుల్ ఎక్కడకు పోయాడనేది తెలిసే అవకాశముంటుందన్నాడు. ఆ బాధ్యతను నేను తీసుకుంటానంటూ రాజ్‌నాథ్‌సింగ్ లేచాడు. రాహుల్‌గాంధీ ఈ దేశానికొస్తేనే మన పార్టీకి భవిష్యత్, రాహుల్‌గాంధీ కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థిగా ఉంటేనే జనం బీజేపీకి ఓట్లేస్తారు, కాబట్టి రాహుల్ కాంగ్రెస్ కంటే మనకే కీలకం, ఈ బాధ్యతను సక్రమంగా నెరవేర్చు అంటూ మోడీ రాజ్‌నాథ్‌కు ఉపదేశించాడు. అందరూ కూడా రాజ్‌నాథ్‌సింగ్‌కు బెస్టాఫ్‌లక్ చెప్పారు.

★★★★★

టెన్‌జనపథ్ ముందు తోటమాలి రూపంలో వాలిపోయాడు రాజ్‌నాథ్‌సింగ్. నెత్తికి తలపాగా చుట్టుకున్నాడు, పాత పంచె, బనియన్ వేసుకుని అచ్చం తోటమాలి లాగే మారిపోయాడు. ఆరోజు టెన్ జనపథ్‌లో అన్ని పనులు చూసుకునే వి. హెచ్.హను మంతరావు సెలవు పెట్టాడని తెలుసుకున్నాడు. తోటమాలి రూపంలో వున్న రాజ్‌నాథ్‌సింగ్‌ను చూసి సోనియా, ఎవర్నువ్వు అని అడిగింది. వి. హెచ్.హను మంతరావు మేనల్లుడిని మేడమ్, మామకు బాగాలేదు, టెన్‌జనపథ్‌లో పనులన్నీ నన్ను చూసుకోమని పంపించాడని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పాడు. సరే పనులు చూసుకోమని చెప్పి సోనియా హాల్‌లోకి వెళ్లింది. అప్పుడే అక్కడకు మన్మోహన్‌సింగ్, ఆంటోనీ, అహ్మద్‌పటేల్, చిదంబరం, పనబాక లక్ష్మిలు వచ్చారు. మన్మోహన్‌సింగ్‌తో సోనియా... కాంగ్రాట్స్ మన్మో హన్‌జీ అని అంది. ఎందుకు మేడమ్ అని ఆశ్చర్యంగా అతను అడిగాడు. బొగ్గుస్కాంలో సిబిఐ వాళ్లు మీ పేరు కూడా పెట్టారుగా! ఇప్పుడు మీరు అసలు సిసలైన కాంగ్రెస్ నాయకుడనిపించుకున్నారు. ఇంతకీ పార్టీ ఎప్పుడిస్తున్నారని అడిగింది. మీరు ఎప్పుడంటే అప్పుడు మేడమ్ అని మన్మోహన్‌సింగ్ చెప్పాడు. అంతలో టీ కప్పులతో రాజ్‌నాథ్‌సింగ్ అక్కడకు వచ్చాడు. అందరూ టీ కప్పులు తీసుకుం టుండగా రాజ్‌నాథ్‌సింగ్ అందరి ముఖాలను గమనించాడు. ఎవరి ముఖంలో కూడా రాహుల్ గాంధీ సెలవు పెట్టి వెళ్లిపోయాడనే బాధ కనిపించ లేదు. అందరి ముఖాలు ఆనందంతో వెలిగిపోతు న్నాయి. పనబాక లక్ష్మి వుండి... మేడమ్, నాకిప్పుడే ఒక ఇన్ఫర్మేషన్ వచ్చింది, మన రాహుల్‌బాబు కనిపించడం లేదని బీజేపీ వాళ్లు తెగ టెన్షన్ పడుతున్నారట, వచ్చే ఎన్నికల దాకా రాహుల్‌గాంధీ రాకుంటే తమ పని ఢమాల్ అని భయపడుతున్నారు. రాహుల్‌ను మనం వెదకడం లేదు. కాని వాళ్లు వెదికే పనిలో ఉన్నారు. ఇంతకీ రాహుల్ బాబు ఎప్పుడు తిరిగొస్తారు మేడమ్ అని అడిగింది. దానికి సోనియా... రాహుల్‌ను నేను సెంటిమెంట్‌తో కొట్టాను. విదేశీ వనితనైన నన్ను పెళ్లాడబట్టే మీ నాన్న రాజీవ్‌గాంధీ ఈ దేశానికి ప్రధాని కాగలి గారు, ఆ సెంటిమెంట్ నీకు కూడా కలిసొస్తుందేమో, నువ్వు కూడా విదేశాలకు వెళ్లి... ప్రపంచంలోని అన్ని దేశాలు తిరుగు... ఉగాండ, ఆఫ్రికా వంటి దేశాల అమ్మాయిలైనా ఫర్వాలేదు, విదేశీయులైతే చాలు... విదేశీ అమ్మాయిని పెళ్లి చేసుకుని వస్తే ఆ సెంటిమెంట్‌తోనన్నా ప్రధాని అవుతావేమో అని చెప్పి ప్రపంచయాత్రకు పంపించాను, బీజేపీ వాళ్లకు రాహుల్ ఎంత మాత్రం దొరికే అవకాశం లేదంది. టీకప్పులు ఇచ్చి అక్కడే నిలబడి వున్న రాజ్‌నాథ్‌సింగ్ ఆమె మాటలు విని... కాంగ్రెస్‌పార్టీ కోసం కొడుకుతో కూడా సెంటిమెంట్‌గా ఆడుకుంటారా అని అక్కడే నోరు తెరిచాడు.

కదంబం

## ఉగాదికి నమస్కారం

గుర్రాల రమణయ్య
నెల్లూరు. 9963921943

ఆ జీవన సంస్కారానికి
ఆ జీవన పరిష్కారానికి
నిత్యనూతన సంకేతక్రాంతి!
ఉగాదికి నమస్కారం
అంతరాంతరాల్లో పాతుకపోయిన
తిమిరాన్ని వెంటాడే కిరణంలా
హృదయంలో సాగే నిరంతర రణంలా
కాలానికి మరణంలేదని చాటే
ఉగాదికి నమస్కారం.
భూ అనువునుండి
ఆకాశ వైశాల్యం వరకు
సమస్త చేతనా చేతనల్లోంచి
అవ్యక్తంగా తరలివచ్చే
వాసంతజ్యోత్స్నా స్నాతమై
విక్షునాలిపై సంధించిన
మల్లెబాణం చేసిన గాయంతో
గలగలా కలకల కూసేకోయిల
పున్నాగ సన్నాయి గానంతో
కదలివచ్చే మదనకదన భావోద్వేగాల
ఉగాదికి నమస్కారం!
మావి పిందెల్ని
వేపపూతల్ని
చెరకుగడల్ని
చింతతీర్చే పులుపుల్ని
గడ్డకట్టిన సముద్రాన్ని
జీవితకారాన్ని
సమపాళ్లలో రంగరించుకొని
సుమనోభావాల్ని సంతరించుకొని
వెలుతురు పాదాలతో
జయజయ ధ్వానాలతో నడచివచ్చే
ఉగాదికి నమస్కారం

## తెలుగు చమత్కారాలు తేనెలాంటివి



నెల్లూరు ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంతపేట ఓబయ్యబడి మీటింగ్ హాల్‌లో తిక్కన మహాకవి లలిత కళాపీఠం వ్యవస్థాపకులు ఆలూరు శిరోమణిశర్మను సత్కరించారు. తెలుగు భాష, చమత్కారాలు అనే అంశంపై ఆలూరి, శ్రీనాథ మహాకవి, తెనాలి రామకృష్ణ మరెందరో కవుల చమత్కారాలను పద్యాలను ఊటంకించి శ్రోతల మన్ననలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పచ్చిపులుసు శ్రీరాములు, కార్యదర్శి ఎస్.వి.కృష్ణయ్య, కోశాధికారి కొండా ప్రేమసాగర్, సహస్రసభా సింహం బి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.

### యోగి వేమన విశ్వ విద్యాలయంలో

## పెరుగు పత్ర సమర్పణ

కడప యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో యుజీసీ సౌజన్యంతో రాయలసీమ ఆధునికకవి – దశ దిశ అనే అంశంపై మార్చి17న జరిగిన జాతీయ సదస్సులో ఆహ్వానిత కవిగా పెరుగు రామకృష్ణ పాల్గొని పత్రసమర్పణ చేశారు. రాయలసీమకు సింహపురి సీమకు వున్న పెన్నా పరివాహక బంధంతో నెల్లూరుజిల్లాలో ఆధునిక కవిత్వం అంశంపై ప్రసంగించారు. చిత్తూరుజిల్లా కవిత మీద ఆచార్య మేడిపల్లి రవికుమార్, కర్నూలు జిల్లా కవిత్వం మీద కవి వెంకటకృష్ణ, అనంతపురం జిల్లా కవిత్వం మీద కవి రాజారామ్ ప్రసంగ పత్రాలు సమర్పణ చేసిన ఈ సదస్సులో తాజా కేంద్ర సాహిత్య అవార్డ్ గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి కీలక ఉపన్యాసం చేసి పత్ర సమర్పకులను ప్రశంసాపత్రాలతో సత్కరించారు. కవికోకిల దువ్వూరు రామిరెడ్డి నుండి సమకాలీన ఆధునిక కవుల గురించి పెరుగు తన పత్రంలో ప్రస్తావించారు.

## 22న 'సృజన' ఉగాది వేడుకలు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 22న నెల్లూరులోని సృజన సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు నిర్వ హించనున్నారు. స్థానిక జు.రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారకభవనం(టౌన్ హాలు)లో జరిగే ఈ వేడుకల్లో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బిజెపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.మమతారెడ్డి, ప్రముఖులు పాలపర్తి సాయిప్రసాద్, డాక్టర్ మారం సుధాకర్, పాతపాటి విజయమోహన్‌రెడ్డి, డాక్టర్ వై.బలరాం, డాక్టర్ వై.భానుశ్రీ, పి. ధనుంజయ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆ సంస్థ అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ తెలియ జేశారు. ఈ సందర్భంగా, సమాజ చైతన్యమే పరమావధిగా కవితా వ్యాసంగం చేస్తున్న కవి, సూక్ష్మ కళాకారుడు కాళహస్తి వెంకటశేషగిరి రావుకు ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, అధ్యాపకురాలు, సింధుభైరవి ఆర్కెస్ట్రా అధినేత శ్రీమతి యు.శ్రీగౌరిని ఘనంగా సత్కరించనున్నట్లు ఆయన తెలిపారు. కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు అందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి ఈ ఉగాది వేడుకలను జయప్రదం చేయాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## సమాజాభ్యున్నతిలో పత్రికల పాత్ర కీలకం

సమాజాభ్యున్నతికి పత్రికలు ఎంతో కీలకమని, సమాజంలోని అనేక అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసేవి పత్రికలేనని నెల్లూరు నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. సోమవారం నెల్లూరులోని ఆర్ఎల్‌రెడ్డి స్మారక భవనం టౌన్‌హాల్‌లో జరిగిన రక్తతిలకం పక్షపత్రిక 19వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా, ఆ పత్రిక ప్రత్యేక సంచికను సూళ్ళూరుపేట చెంగాళమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ వై. హర్షవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం, కవి-పాత్రికేయుడు మద్దూరు శ్రీనివాసులు(లాయర్ వారపత్రిక)ను శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి, ఏ.పి వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు ఏ.జయప్రకాష్, ఏ.పి ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధి తిరివీధి ప్రకాశ రావు, ఎస్.రామారావు, ఎం.ప్రభాకరరావు, ఎస్.రామమూర్తిలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు 'రాం'రామ్



**నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి... కాంగ్రెస్ బ్రాండ్. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూను చూసాడు, ఆయన కూతురు ఇందిరాగాంధీ మెప్పు పొందాడు, ఈమె కొడుకు రాజీవ్‌గాంధీ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యాడు. రాజీవ్ భార్య సోనియాగాంధీ హయాంలోనూ కాంగ్రెస్‌లో తన హవాను చాటుకున్నాడు. జవహర్‌లాల్ నెహ్రూ నుండి ఆయన మునిమనుమడు రాహుల్‌గాంధీ దాకా అందరినీ ఎరిగిన నాయకుడు, అందరితో కలిసి పనిచేసిన నాయకుడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి. కాంగ్రెస్‌పార్టీలో ఆయనకున్న సీనియారిటీ, సిన్సియారిటీ బహుశా ఇందిరమ్మ కుటుంబసభ్యులకు కూడా ఉండదంటే అతిశయోక్తి కాదేమో! నేదురుమల్లి రాజకీయ ప్రస్థానం మొదలైంది, మరణంతో ముగిసింది కాంగ్రెస్‌పార్టీలోనే! ఆ పార్టీ కష్టకాలంలో వున్నప్పుడు కూడా నేదురుమల్లి పార్టీ మారే ఆలోచన చేయలేదు. అసలు అలాంటి ఆలోచనే ఆయన తలపు చేరేది కాదు.**

కాని ఆయన నలుగురు కొడుకులలో రాజకీయ వారసుడిగా వున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాత్రం తండ్రి ఆశయానికి తూట్లు పొడుస్తూ కాంగ్రెస్‌ను వదిలేసి భారతీయ జనతాపార్టీలో చేరడానికి సిద్ధమయ్యాడు. ఈనెల 22న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు సమక్షంలో ఆయన తన అనుచరులతో కలసి బీజేపీలో చేరబోతున్నారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి రాజకీయంగా పెద్ద నాయకుడు కాకపోయినా నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కొడుకు బీజేపీలో చేరుతున్నాడనేది పెద్ద సంచలనమైంది.

రాంకుమార్‌రెడ్డి 2014ఎన్నికలప్పుడే ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చాడు. నేదురుమల్లి జాతీయ, రాష్ట్ర రాజకీయాలలో చురుకుగా ఉన్నప్పుడు తన వారసులెవరినీ రాజకీయాల్లోకి తీసుకురాలేదు. రాంకుమార్‌రెడ్డి కూడా నేదురుమల్లి ఇక పనిచేయలేని స్థితిలో వున్నప్పుడు తెరమీదకొచ్చారు. 2014లో వెంకటగిరి అసెంబ్లీ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఈమధ్య ఇందిరాభవన్ విషయమై ఆనం వర్గంతో విభేదాలొచ్చాయి. జిల్లా కాంగ్రెస్‌లో ఆనందే పెత్తనమైంది. పార్టీలో ఉంటే రాంకుమార్‌రెడ్డిది ఒంటరి పోరాటమే. కాంగ్రెస్‌లో వున్నా భవిష్యత్ వుంటుందనే నమ్మకం లేదు. అసలు రాష్ట్రంలో కాంగ్రెస్ ఉనికే నామమాత్రంగా మిగిలింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో ఉండడం కంటే రాజకీయ ప్రత్యామ్నాయం చూసుకోవడం మేలనే ఉద్దేశ్యంతోనే ఆయన బీజేపీలో చేరుతున్నట్లు తెలుస్తుంది.

# మంత్రిపై ధ్వజమెత్తిన 'దేశం' అధ్యక్షులు

జిల్లాలోని ఆయా మండలాల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు గురువారం నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో సమావేశం పెట్టారు. మంత్రి నారాయణపై విరుచుకు పడ్డారు. జిల్లాలో పార్టీ పెత్తనాన్ని ఆయన నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. మంత్రి నారాయణ జిల్లాలో పార్టీ పటిష్టతపై శ్రద్ధ చూపడం లేదని, పార్టీ కార్యకర్తల కంటే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఆయన ప్రాధాన్యత ఇస్తున్నాడని ఆరోపించారు. మండలాధ్యక్షులు ఈ స్థాయిలో మంత్రి ధ్వజమెత్తడం సంచలనంగా మారడమే కాక, దీని వెనుక ఎవరున్నారనేది చర్చనీయాంశంగా మారింది!






## ఉత్తరక్రియలు




మమతల మణిదీపం, మా ఇంటి దీపం

**శ్రీమతి ఆలూరు సుజాత**

మమ్ము విడిచి సుదీర తీరాలకు తరలి వెళ్లినా
మీ జ్ఞాపకాలు మా హృదయాలలో పదిలంగా వుంటాయి.
మీ ఆత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ...
శోకతప్త హృదయాలతో...

భర్త : **ఆలూరు శ్రీనివాసులురెడ్డి**
అత్త : **ఆలూరు పంకజాక్షమ్మ**

కుమారులు - కోడళ్లు
**ఆలూరు ప్రదీప్‌రెడ్డి - సుష్మ**
**డాక్టర్ ఆలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి - రూప**

మరిది - చెల్లెలు
**ఆలూరు అనిల్‌కుమార్‌రెడ్డి - శోభన**

కుమార్తె : **డాక్టర్ సుష్మిత - పిడతల భాస్కర్‌రెడ్డి, USA**
కుమారుడు : **ఆలూరు శ్రీకాంత్‌రెడ్డి - సాహితి**

మరియు **మనుమలు, మనుమరాండ్రు, కుటుంబసభ్యులు**

**ఉత్తరక్రియలు :** తేది 26-03-2015 గురువారం నాడు కోవూరు, పాటూరురోడ్డులోని మా స్వగృహమునందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com